సాక్షి
జోగులాంబ గద్వాల
మంగళవారం । 31 । అక్టోబర్ । 2023



ఉల్లాసంగా.. ఉత్సాహంగా
మూలమల్లలో ఆలిండియా ఇన్విటేషన్ కబడ్డీ పోటీలు సోమవారం కొనసాగాయి.

వివరాలు IIలో ▸



వర్గీకరణ కోసమే..
ఎస్సీ వర్గీకరణ కోసమే పోరాటం కొనసాగుతుందని మందకృష్ణ తేల్చిచెప్పారు.

వివరాలు IIలో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
33.4 /23.2

రోజంతా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమవుతుంది. సాయంత్రం చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

బీఎస్పీ అభ్యర్థుల ఖరారు
సాక్షి, నాగర్‌కర్నూల్: బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ (బీఎస్పీ) రెండో విడత అసెంబ్లీ అభ్యర్థుల జాబితాను సోమవారం ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 39 నియోజకవర్గాల్లో అభ్యర్థులను వెల్లడించగా.. ఇందులో మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా నుంచి 8 నియోజకవర్గాల్లో అభ్యర్థులను ఖరారు చేసింది. మహబూబ్‌నగర్ అసెంబ్లీ టికెట్ బోయ స్వప్న శ్రీనివాసులుకు కేటాయించగా.. కొడంగల్‌లో కురువ నర్మద కిష్టప్ప, దేవరకద్రలో బసిరెడ్డి సంతోష్‌రెడ్డి, మక్తల్‌లో వర్కటం జగన్నాథ్ రెడ్డి, అచ్చంపేటలో మోత్యూరి నాగార్జున, కల్వకుర్తిలో కొమ్ము శ్రీనివాస్ యాదవ్, షాద్‌నగర్‌లో పసుపుల ప్రశాంత్ ముదిరాజ్, కొల్లాపూర్‌లో గగనం శేఖరయ్యలను తమ పార్టీ అభ్యర్థులుగా ప్రకటించింది. నాగర్‌కర్నూల్ నుంచి కొత్తపల్లి కుమార్‌కు మొదటి జాబితాలో అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. మిగతా నియోజకవర్గాలకు సంబంధించి మూడో విడతలో అభ్యర్థులను ప్రకటించనున్నారు.

నామినేషన్ల ప్రక్రియపై అవగాహన తప్పనిసరి



అలంపూర్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల దాఖలుపై అభ్యర్థులు అందరూ అవగాహన కలిగిఉండాలని, ఒకటికి రెండు సార్లు సరిచూసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి చంద్రకళ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నామినేషన్ల దాఖలు ప్రక్రియ 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు కొనసాగుతుందని, 13న నామినేషన్ పత్రాల పరిశీలన, ఉపసంహరణతో పాటు ఫైనల్ లిస్టు ప్రదర్శించడం జరుగుతుందన్నారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు ఒక రోజు ముందు తన పేరిట బ్యాంక్ ఖాతా తెరవాలని, కేవలం ఎన్నికల ఖర్చు నిమిత్తం ఈ ఖాతాను వినియోగించాల్సి ఉంటుందన్నారు. నామినేషన్ పత్రాలతోపాటు గుర్తింపు పొందిన పార్టీలు ఇచ్చే ఏ, బీ ఫాంలు జతపర్చాలన్నారు. ఎన్నికల ఖర్చు రూ.40 లక్షలు మించవద్దని, వీటిపై తనిఖీ బృందాల నిఘా ఉంటుందన్నారు. సువిధ యాప్‌లో ఖర్చుల వివరాలు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఖర్చుల వివరాల వ్యత్యాసాలపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి నోటీసులు జారీ చేస్తే తప్పకుండా వివరణ ఇవ్వాలన్నారు. సీ–విజిల్ యాప్ ప్రతి పౌరుడి చేతిలో ఉంటుందని, రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎన్నికల నియమావళికి లోబడి వ్యవహరించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిణి మంజుల, ఎన్నికల డీటీ వేణుగోపాల్ రెడ్డి, అకౌంటింగ్ బృందం అధికారి మహేస్, బీజేపీ, బీఎస్పీ, ఎంఐఎం పార్టీల నాయకులు హాజరయ్యారు.

హామీలు నీటి మూటలే..
గద్వాల మున్సిపాలిటీలో సమస్యల తిష్ట



అధ్వానంగా ధరూరు మెట్టు రహదారి



గద్వాల మున్సిపాలిటీ గంజిపేటలో కుక్కలగుంపు

- అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఫుట్‌పాత్‌లు కరువు
- పార్కుల నిర్వహణ, తాగునీరు, రహదారుల సమస్యలు తీరలే..
- ఎన్నికలకు ముందు నాయకులు హామీలిచ్చి మరిచారు
- సాక్షి 'పీపుల్స్ ఎజెండా'లో గళమెత్తిన జనం

పీపుల్స్ ఎజెండా

గద్వాల రూరల్: ఎన్నికల సందర్భంలో గద్వాల పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం.. మౌళిక వసతులైన డ్రైనేజీ, అంతర్గత రహదారులు, పార్కుల ఏర్పాటు వంటివి చేపడతామని చెప్పిన పాలకుల హామీలు నేటికి నీటి మూటలుగానే మిగిలిపోయాయి. మరోవైపు జిల్లా కేంద్రమైన గద్వాల మున్సిపాలిటీ శరవేగంగా విస్తరిస్తుంది. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా వేధిస్తుంది. ప్రధానంగా మెయిన్ బజారులో దుకాణాల సముదాయాల వద్ద వాహనాలు నిలిపేందుకు సరైన స్థలం, ఫుట్‌పాత్‌లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతేడాది ఎన్నికల సమయంలో గద్వాల పట్టణానికి ప్రత్యేక నిధులు ఇస్తామని సీఎం కేసీఆర్ హామీలిచ్చారు. అయితే ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో నెరవేరకపోవడంతో చాలా సమస్యలు పరిష్కారం కాలేదు. ఈ అంశాలపై సోమవారం 'సాక్షి' నిర్వహించిన పీపుల్స్ ఎజెండాలో గద్వాల ప్రజలు సమస్యలపై గళమెత్తారు. వారి అభిప్రాయాలిలా..

ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది



గద్వాల పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతుంది. గతంతో పోల్చితే జనాలు జిల్లా కేంద్రానికి వివిధ అవసరాల నిమిత్తం రెట్టింపు సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ప్రధానంగా దుకాణాల సముదాయం వద్ద వాహనాలు నిలిపేందుకు సరైన పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో రోడ్లపైనే వాహనాలు నిలిపేయాల్సిన పరిస్థితి. పాలకులు స్పందించి హామీలు నెరవేర్చి సమస్యలు పరిష్కరిస్తే బాగుంటుంది.

– అంజి, ఐడీఎస్‌ఎంటీ కాలనీ, గద్వాల

పార్కుల నిర్వహణ మరిచారు



గద్వాలలో చాలా కాలనీలలో సరైన పార్కులు లేవు. పైగా కొన్ని చోట్ల ఏర్పాటు చేసిన పార్కులలో సరైన నిర్వహణ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భీంనగర్ కాలనీలో ఉన్న పార్కులో ఆడుకునేందుకు పిల్లలు వెళ్లగా అక్కడ ఉండే బోరుమోటారు విద్యుత్ షాక్ తగిలి ఓ చిన్నారి మృత్యువాతకు గురయ్యాడు. ఇది పూర్తిగా నిర్వహణ లోపంతోనే చోటుచేసుకుంది. గడ్డి, పిచ్చి మొక్కల తొలగించకపోవడంతో విషపురుగుల బారిన పడుతున్నారు. నిర్వహణ సక్రమంగా చేయాలి.

– అనిల్, గద్వాల

పార్కింగ్ స్థలాల్లేవ్



గద్వాలలో ఇటీవల కాలంలో షాపింగ్ మాల్స్, ప్రైవేటు ఆసుపత్రులు వెలుస్తున్నాయి. నిబంధనల ప్రకారం వీటి నిర్మాణానికి ముందు పార్కింగ్‌కు అవసరమైన స్థలాలు వదలాలి. కానీ అలా చేయడం లేదు. భీంనగర్, డీఎస్పీ ఆఫీసు సమీప ప్రాంతం, కృష్ణవేణిచౌరస్తా, పోస్టాఫీసు, రాజీవ్‌మార్గ్ ప్రాంతాల్లోని షాపింగ్ మాల్స్, ఆసుపత్రుల వద్ద రోడ్లపైనే వాహనాలు నిలపాల్సి వస్తోంది. వీటిపై పాలకులు తగిన చర్యలు తీసుకుని పరిష్కరించాలి. – మోహన్‌రావు, సీనియర్ సిటిజన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు, పెద్ద అగ్రహారం

రహదారులు అధ్వానం



జిల్లా కేంద్రంలో ఎక్కడ చూసిన రహదారులు అధ్వాన్నంగా మారాయి. ముఖ్యంగా పాతబస్టాండు, అంబేడ్కర్‌చౌరస్తాలలో రహదారులు దారుణంగా ఉన్నాయి. రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారి, తెలంగాణ చౌరస్తా, ధరూరు మెట్టు దారులు గుంతలమయమయ్యాయి. వీటిపై ప్రయాణంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలువురు ప్రమాదాల భారినపడ్డారు. గత ఎన్నికల సమయంలో నాయకులు ప్రధాన సమస్య అయిన రోడ్లను బాగుచేస్తామన్నారు. ఇప్పటికైనా ఈ రహదారులను బాగుచేయాలి. – బి.రవికుమార్, రాజవీధి, గద్వాలపట్టణం

వీధికుక్కల బెడద తీవ్రం



మా కాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఇప్పటికే చిన్నపిల్లలు, వృద్ధులను చాలా సార్లు గాయపర్చాయి. అప్పటికప్పుడు కొన్ని కుక్కలను పట్టుకొని వెళ్లారు. తిరిగి వాటి సంతతి పెరిగింది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. – వెంకటేష్, నల్లకుంట, గద్వాలపట్టణం

దోమలతో బెంబేలు



శ్రీనివాస కాలనీలో దోమలబెడద తీవ్రంగా ఉంది. డ్రైనేజీలు సరిగా శుభ్రం చేయరు. చుట్టుముట్టూ కంప చెట్లు ఉండడంతో దోమల సంఖ్య మరింత తీవ్రమైంది. దీంతో చిన్నారుల నుంచి పెద్దవారి వరకు తరచూ దోమ కాటుకు గురై విషజ్వరాల బారిన పడుతున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకుని దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– పద్మ, శ్రీనివాసకాలనీ, గద్వాల

డంపింగ్‌యార్డు తరలించాలి



గద్వాల మున్సిపాలిటీకి సంబంధించి సేకరించిన చెత్తాచెదారాన్ని గద్వాల మండలం గోనుపాడు సమీపంలో ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డులో వేస్తూ చెత్తాచెదారాన్ని కాల్చివేస్తున్నారు. ఇలా చెత్తను వేస్తూ, కాల్చివేసే క్రమంలో సమీప గ్రామమైన గోనుపాడు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనిపై పలుమార్లు అధికారులు, పాలకులకు ఫిర్యాదు చేశాం. అయినా పట్టించుకోలే. దీంతో ఈనెల 22వ తేదీన డంపింగ్‌యార్డుకు తాళం వేసి నిరసన తెలిపాం. ఇప్పటికైనా డంపింగ్‌యార్డును ఇక్కడి నుంచి శాశ్వతంగా తరలించాలి. – గోనుపాడు గ్రామస్తులు

డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం



నల్లకుంట కాలనీ పట్టణంలో లోతట్టు ప్రాంతం. ఇక్కడ చిన్నపాటి వర్షాలకు కూడా ఇళ్లలోకి వర్షపు నీరు వచ్చిచేరుతుంది. దీనికి ప్రధాన కారణం డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడమే. ప్రతి వానాకాలం సీజన్‌లో ఈవిషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. కానీ ఎవరు కూడా స్పందించడంలేదు. సమస్యపై దృష్టిసారించి శాశ్వత పరిష్కారం చూపాలి.

– శ్రీనివాసులు, నల్లకుంట, గద్వాలపట్టణం

దుమ్ముదూళితో ఉక్కిరిబిక్కిరి



గద్వాల రోడ్లన్ని దారుణంగా గుంతలమయంగా ఉండడమే కాకుండా రోడ్లపై దుమ్ముధూళి ఎక్కువగా చేరింది. మోటారుసైకిళ్లపై వెళ్లే వారికి దుమ్ముదూళి పోయి శ్వాసకోస వ్యాధుల భారిన పడుతున్నారు. బస్సులు, లారీలు వంటి పెద్ద వాహనాలు ముందు వెళ్తుంటే వచ్చే దుమ్ముకు రోడ్డు కూడా కనపడని దుస్థితి నెలకొంది. దీనిపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించి రోడ్లపై దుమ్ముదూళి లేకుండా విధిగా నీరు చల్లించాలి. – సురేష్, రెండవ రైల్వేగేటు, గద్వాలపట్టణం

నేడు పాలమూరు ప్రజాభేరి



కొల్లాపూర్‌లో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న మల్లురవి, జూపల్లి కృష్ణారావులు

కొల్లాపూర్‌లో కాంగ్రెస్ భారీ బహిరంగ సభ
- హాజరుకానున్న ఏఐసీసీ అగ్రనాయకురాలు ప్రియాంకాగాంధీ
- భారీ జనసమీకరణకు నాయకుల ఏర్పాట్లు
- రేపు కల్వకుర్తి, జడ్చర్లలో రాహుల్‌గాంధీ పర్యటన
- అగ్రనేతల రాకతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం

సాక్షి ప్రతినిధి మహబూబ్‌నగర్/ సాక్షి, నాగర్‌కర్నూల్: ఉమ్మడి పాలమూరు జిల్లాలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ప్రియాంకాగాంధీ పర్యటించనున్న నేపథ్యంలో ఇరువురి బహిరంగ సభల నిర్వహణకు కాంగ్రెస్ భారీ ఏర్పాట్లు చేస్తోంది. మంగళవారం నిర్వహించే కాంగ్రెస్ బహిరంగ సభలో ఆ పార్టీ అగ్రనేత ప్రియాంకాగాంధీ పాల్గొననున్నారు. కొల్లాపూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు నిర్వహించే 'పాలమూరు ప్రజాభేరి' బహిరంగ సభకు హాజరై ప్రసంగిస్తారు. అయితే అడ్డాకుల మండలం తిమ్మాయిపల్లితండాలోనూ ప్రియాంకాగాంధీ పర్యటన ఉండగా చివరి క్షణాల్లో రద్దయ్యింది.

జనసమీకరణకు ఏర్పాట్లు
కొల్లాపూర్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభకు పెద్దఎత్తున జన సమీకరణ చేసేందుకు కాంగ్రెస్ ఏర్పాట్లు చేస్తోంది. అగ్రనేత ప్రియాంకాగాంధీ ఇక్కడి నుంచే మహిళలకు ఇచ్చే గ్యారంటీ పథకాలను వివరించనున్నారు. ఈ సభకు ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 2 లక్షల వరకు ప్రజలను సమీకరించేలా ఏర్పాట్లు చేశామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఇందుకు తగ్గట్టుగా ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. సభాప్రాంగణం, హెలీప్యాడ్, పార్కింగ్ తదితరవి సిద్ధం చేశారు. ఎన్నికలకు ముందు ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రియాంక, రాహుల్‌గాంధీ పర్యటనలపై ఆ పార్టీ గంపెడు ఆశలు పెట్టుకుంది.

రేపు రాహుల్ పర్యటన..
కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ బుధవారం ఉమ్మడి పాలమూరు జిల్లాలో పర్యటించనున్నారు. కల్వకుర్తి, జడ్చర్ల, షాద్‌నగర్ నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించే కార్నర్ మీటింగ్‌ల్లో ఆయన పాల్గొని మాట్లాడతారు. మధ్యాహ్నం 3 గంటలకు కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం 4 గంటలకు జడ్చర్లలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిర్వహించే కార్నర్ మీటింగ్‌లో మాట్లాడతారు. సాయంత్రం 5 గంటలకు షాద్‌నగర్ పట్టణంలోని రైల్వేస్టేషన్ నుంచి షాద్‌నగర్ చౌరస్తా వరకు పాదయాత్ర చేపట్టి, చౌరస్తాలో నిర్వహించే బహిరంగ సభలో ప్రసంగించనున్నారు.

ఏర్పాట్ల పరిశీలన
కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో నిర్వహించే బహిరంగ సభావేదిక, వీఐపీ గ్యాలరీల వద్ద ఏర్పాట్లను సోమవారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. అనంతరం మల్లురవి మాట్లాడుతూ ఇందిరాగాంధీ పోలికలతో ఉండే ప్రియాంకాగాంధీని చూసేందుకు ప్రజలు ఆసక్తితో ఉన్నారన్నారు. 2 లక్షల మందిని సభకు తరలించేలా ఏర్పాట్లు చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల గురించి ప్రియాంకాగాంధీ వివరిస్తారని చెప్పారు. జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్‌లో చేరినప్పుడే ప్రియాంకాగాంధీ సభ కోసం ఏర్పాట్లు చేశామని, అప్పుడు వాతావరణం అనుకూలించక సభ వాయిదా పడిందన్నారు. కొల్లాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు 50 వేల మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ సభలో కేసీఆర్ బండారం మొత్తం బయటపెడతానన్నారు. స్థానిక ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిని లెక్కలోకి తీసుకోవడం లేదని, ప్రజలు కూడా ఆయనను పట్టించుకోవడం లేదని, కేసీఆర్‌ను గద్దె దించడమే తమ లక్ష్యం అని చెప్పారు. వారి వెంట ఎన్నికల పర్యవేక్షకులు పీవీ మోహన్, నాయకులు నర్సింహరావు, నాగరాజు, హన్మంతునాయక్, రహీంపాషా, నయీం, ఎక్బాల్ తదితరులున్నారు.

శ్రేణుల్లో నూతనోత్సాహం
ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్‌లోకి పలువురు సీనియర్ నేతల రాకతో ఆ పార్టీలో జోష్ నెలకొనగా.. ఇప్పుడు పార్టీ అగ్రనేతలు రాహుల్, ప్రియాంకాగాంధీ పర్యటనలు, బహిరంగ సభల నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది. ఇరువురి పర్యటనల సందర్భంగా పెద్దఎత్తున ప్రజలను సమీకరించడం ద్వారా తమ సత్తా చాటాలని కాంగ్రెస్ భావిస్తోంది. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఇంటింటికీ చేర్చి ప్రజల్లో నమ్మకం కల్పించడం ద్వారా పార్టీని అధికారంలోకి తెస్తామని చెబుతోంది. రాహుల్, ప్రియాంకాగాంధీల రెండు రోజుల పర్యటనతో ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో వేగం పెంచినట్లయింది.

వేరుశనగ క్వింటా రూ.6,300
గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు సోమవారం 407 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ. 6300, కనిష్టం రూ. 3029, సరాసరి రూ. 5380 ధరలు పలికాయి. అలాగే, 219 క్వింటాళ్ల ఆముదం రాగా, గరిష్టం రూ. 5380, కనిష్టం రూ. 2586, సరాసరి రూ. 5260 ధరలు వచ్చాయి.

ఆర్టీసీకి దసరా లాభాలు
- ఈ నెల 19 నుంచి 29 వరకు రూ.15.21 కోట్ల ఆదాయం
- 26న ఒక్కరోజే రికార్డు స్థాయిలో రూ.2 కోట్లు
- తిరుగు ప్రయాణంలోనూ ఆదరణ



మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో ప్రయాణికులు

స్టేషన్ మహబూబ్‌నగర్: దసరా పండుగ మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌కు మెరుగైన ఆదాయం తెచ్చింది. దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం రీజియన్‌లోని డిపోల నుంచి 374 అదనపు బస్సు సర్వీసులను నడిపారు. గతేడాది దసరా పండుగ సందర్భంగా 345 అదనపు బస్సులు నడపగా ఈసారి 29 అధికంగా బస్సులు నడిచాయి. ముఖ్యంగా హైదరాబాద్ రూట్లో ఎక్కువ బస్సులు రాకపోకలు సాగడంతో ఈ మార్గంలోనే మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌కు అధిక ఆదాయం వచ్చింది. దసరా పండుగ సెలవుల అనంతరం ప్రజలు తిరుగు ప్రయాణంతో రీజియన్‌కు రోజువారీ ఆదాయం పెరుగుతోంది.

రీజియన్ పరిధిలో..
ఎన్నడూ లేని విధంగామహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌కు ఆదాయం వచ్చింది. ఈ నెల 19 నుంచి 29 వరకు రీజియన్ రూ.15,21,09,703 ఆదాయం వచ్చింది. రీజియన్ 76.53 ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్), 45.31 శాతం ఈపీకే సాధించింది. మహబూబ్‌నగర్ రూ.21 కోట్లు, వనపర్తి రూ.20 కోట్ల ఆదాయాన్ని పొందాయి.

26న రికార్డుస్థాయిలో..
ఈ నెల 26న మహబూబ్‌నగర్ రీజియన్ రికార్డు స్థాయిలో రూ.2,04,92,917 ఆదాయాన్ని సాధించింది. ఒక్క రోజే రీజియన్‌లో బస్సులు 3,26,713 కిలోమీటర్లు తిరగగా ఈ ఆదాయాన్ని పొందింది. మహబూబ్‌నగర్ డిపో రూ.32,38,625, వనపర్తి రూ.26,85,564, గద్వాల రూ.25,43,911, కల్వకుర్తి రూ.23,94,249 ఆదాయం వచ్చింది.



సమష్టి కృషితోనే..



దసరా పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు బస్సులు నడిపాం. రీజియన్‌లోని అందరి ఉద్యోగుల సమన్వయం, సమష్టి కృషితో దసరా పండుగ రోజుల్లో మంచి ఫలితాలు వచ్చాయి. ముఖ్యమైన కేంద్రాల్లో ఆయా విభాగాల ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించి ప్రయాణికులు గమ్యస్థానాల్లో చేర్చేలా చూశాం. ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందిస్తాం.

– శ్రీదేవి, ఆర్టీసీ ఆర్‌ఎం, మహబూబ్‌నగర్

19 నుంచి 29 వరకు డిపోల వారీగా ఆదాయం (రూ.లలో)

డిపో	తిరిగిన కి.మీ.,	ఆదాయం	ఈపీకే	ఓఆర్
మహబూబ్‌నగర్	4,91,863	2,31,81,343	47.13	79
వనపర్తి	4,43,572	2,09,87,367	47.31	80
గద్వాల	3,88,427	1,79,33,984	46.17	78
కల్వకుర్తి	3,89,037	1,73,97,398	44.72	78
నారాయణపేట	3,51,199	1,57,52,896	44.85	74
నాగర్‌కర్నూల్	3,42,885	1,49,45,180	43.59	74
అచ్చంపేట	3,38,836	1,49,38,089	44.09	74
షాద్‌నగర్	3,16,909	1,41,65,597	44.70	77
కొల్లాపూర్	2,45,397	1,09,38,795	44.58	74
కోస్గి	49,074	18,69,054	38.09	66

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు
- నామినేషన్లకు సర్వం సిద్ధం చేయాలి
- కౌంటింగ్ సెంటర్లు, స్ట్రాంగ్‌రూంల వద్ద భద్రత కట్టుదిట్టం
- కలెక్టర్ వల్లూరు క్రాంతి



కలెక్టరేట్‌లోని పర్యవేక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రితీరాజ్

గద్వాల రూరల్: శాసనసభ ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు, కౌంటింగ్ సెంటర్‌లో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె గద్వాల మండలం గోన్‌పాడ్ వద్దనున్న పాలిటెక్నిక్ కాలేజీలో అలంపూర్, గద్వాల నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పోలింగ్ అనంతరం ఈవీఎంలను భద్రపర్చే స్ట్రాంగ్ రూంలు వంటి వసతులను ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా కౌంటింగ్ సమయంలో అవసరమైన ఏర్పాట్లు, పటిష్ఠమైన పోలీసుబందోభస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వవద్దని సూచించారు. ఈసందర్భంగా కౌంటింగ్ రూంలు, స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. దీంతో పాటు నిత్యం మానిటరింగ్ చేస్తూ ప్రత్యేకంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ రితీరాజ్, అదనపు కలెక్టర్లు అపూర్వ్‌చౌహాన్, చీర్ల శ్రీనివాసులు, తహసీల్దార్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ కేంద్రం పరిశీలన
శాసనసభ ఎన్నికలను పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా పటిష్ఠమైన నిఘా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సోమవారం ఆమె ఎస్పీ రితీరాజ్‌తో కలిసి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన నిఘా సెంటర్లను పరిశీలించారు. జిల్లాలో ఆరు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక్కడ ప్రత్యేక రెవెన్యూ,పోలీసుఅధికారులతో కూడిన బృంధం నిరంతరం నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు. కె.టి.దొడ్డి మండలం, నందిన్నె, గట్టు మండలంబలిగెర, ఉండవెల్లిపుల్లూరు, రాజోలిసుంకేసుల, అలంపూరు మండలం ర్యాలంపాడు, ఇటిక్యాల మండలం ఎర్రవల్లిలో చెక్‌పోస్టులలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన నిఘాకేంద్రాలకు అనుసంధానం చేసినట్లు తెలిపారు. 24గంటల పాటు నిరంతరం నిఘా కొనసాగుతుందన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అపూర్వ్‌చౌహాన్, చీర్ల శ్రీనివాసులు, ఆర్డీవో చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

సి–విజిల్‌పై విస్తృత అవగాహన
శాసనసభ ఎన్నికలను సజావుగా, పకడ్బందీగా నిర్వహించాలని కేంద్ర డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్ అన్నారు. సోమవారం కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతి పాల్గొన్నారు. సి–విజిల్ యాప్‌ను జిల్లాలో విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. ఈకార్యక్రమంలో ఎస్పీ రితీరాజ్, అదనపు కలెక్టర్లు అపూర్వ్ చౌహాన్, చీర్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రాణం తీసిన అనుమానం

హన్వాడ: ఓ భర్త కట్టుకున్న భార్యపై అనుమానంతో హత్య చేసిన ఘటన సోమవారం మండలంలోని కిష్టంపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మహబూబ్‌నగర్ మండలంలోని పాలకొండకు చెందిన అర్వ ఈశ్వరమ్మ(38)ను 21ఏళ్ల క్రితం కిష్టంపల్లికి చెందిన అర్వ కృష్ణయ్యకు ఇచ్చి వివాహం చేశారు. వారి జీవితంలో అనుమానం అనే భూతం దాపురించడంతో ఐదేళ్లుగా భార్యభర్తల మధ్య గొడవ లకు దారి తీసింది. ఈవిషయంపై పలుమార్లు గ్రామంలో, బంధువుల సమక్షంలో పంచాయితీలు పెట్టి భర్త హెచ్చరించినా ఫలితం లేకపోయింది. ఆదివారం రాత్రి అందరూ నిద్రించాక భార్యపై పథకం ప్రకారం కాళ్లు, చేతులు కట్టేసి, గట్టిగా అదిమిపట్టి పీకను నొక్కి హత్య చేశాడు. అనంతరం చున్నీతో భార్య గొంతుకు కట్టి ఇంట్లోని ప్యాన్‌కు వేలాడే దీసే క్రమంలో పెద్ద కొడుకు చూసి తన తాతయ్యకు చెప్పాడు. దీంతో ఒక్కసారిగా ఈవిషయంపై అతన్ని గట్టిగా వారించారు. సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. ఘటనపై ఈశ్వరమ్మ తండ్రి బత్తుల శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవినాయక్ పేర్కొన్నారు.

జూరాల కాల్వలో యువతి గల్లంతు

పెబ్బేరు రూరల్: జూరాల కాల్వలో యువతి గల్లంతైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ జగదీశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. పెబ్బేరు పట్టణ కేంద్రంలో నివాసం ఉంటున్న సకినాబి (25) జూరాల కాల్వకు దుస్తులు ఉతకడానికి జూరాల కాల్వకు వెళ్లింది. ఈ సమయంలో కాలు జారి కాల్వలో పడిపోవడంతో నీళ్లలో మునిగి కొట్టుకుపోయింది. కాగా ఆమె ఆచూకీ లభించలేదు. ఈ విషయంపై భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం పట్టివేత



అలంపూర్ రూరల్: పట్టణంలోని తెలంగాణ అతిథి టూరిజం హోటల్ సమీపంలో సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా బైక్‌పై మద్యం తీసుకెళ్తున్న వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మడుగు రమేష్ తెలిపారు. మండలంలోని గొందిమల్లకు చెందిన బోయ దుబ్బన్న బెల్టు షాపులో మద్యం విక్రయించేందుకు రూ.31,240 విలువ చేసే 8.6లీటర్ల మద్యం తరలిస్తుండా పట్టుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

గోవా మద్యం..

కృష్ణా: మండల సరిహద్దులో గల చెక్‌పోస్టులో సోమవారం ఎక్సైజ్, స్థానిక పోలీసులు సంయుక్తంగా వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో గోవా నుంచి తీసుకొచ్చిన మద్యం లభించిందని, దాని విలువ రూ.8వేల వరకు ఉంటుందని ఎక్సైజ్ సీఐ శ్రావణకుమార్‌తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మార్కెట్‌కు హంస వరిధాన్యం

దేవరకద్ర: మార్కెట్ యార్డుకు ధాన్యం రాక జోరందుకుంది. హంస పంటను కోత కోసి మార్కెట్‌కు అమ్మకానికి తీసుకరావడం ప్రారంభించారు. దీంతో ప్రతిరోజూ మార్కెట్‌కు హంస ధాన్యం పెద్దఎత్తున అమ్మకానికి వస్తుంది. సోనామసూరి పంట మరో రెండు వారాల తరువాత కోత దశకు వచ్చే అవకాశం ఉంది.

రాజకీయాల్లో సంచలనం

- ప్రతి ఎన్నికల్లో విలక్షణ తీర్పునిచ్చిన కల్వకుర్తి ఓటర్లు
- ఎన్టీఆర్‌ను ఓడించిన ఘనత ఈ ప్రాంతానిది
- కేంద్రంలో చక్రం తిప్పిన జైపాల్‌రెడ్డి స్థానికుడే..
- 2014 ఎన్నికల్లో రాష్ట్రంలో రీపోలింగ్ జరిగిన నియోజకవర్గం
- 17 సార్లు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌దే హవా
- కల్వకుర్తి నియోజకవర్గంలో 2,30,650 మంది ఓటర్లు



కల్వకుర్తి పట్టణ వ్యూ..

కల్వకుర్తి: మహామహులకు రాజకీయ జీవితాన్ని అందించిన నియోజకవర్గం. కేంద్రంలో, రాష్ట్రంలో ఇక్కడ గెలిచిన వారు మంత్రులుగా పనిచేశారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావును సైతం ఎన్నికల్లో ఓడించి విలక్షణ తీర్పునిచ్చిన ఘనత ఇక్కడి ఓటర్లది. ఇలా ప్రతి ఎన్నికల్లో పార్టీలు అనుకున్న దానికన్నా విలక్షణ తీర్పును అందిస్తున్న కల్వకుర్తి ప్రత్యేకతలు ఎన్నో. 1952లో ఏర్పడిన కల్వకుర్తి నియోజకవర్గంలో ఇప్పటి వరకు 17 సార్లు ఎన్నికలు జరిగాయి. 1952, 1957లో ద్విసభా నియోజకవర్గంగా ఉండటంతో అప్పుడు జరిగిన ఎన్నికల్లో రెండుసార్లు కాంగ్రెస్ విజయం సాధించింది. నియోజకవర్గం ఏర్పడినప్పుడు జనరల్, ఆ తర్వాత ఎస్టీ, తర్వాత జనరల్‌కు కేటాయించారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో 9 సార్లు కాంగ్రెస్, 3 సార్లు ఇండిపెండెంట్, 2 సార్లు జనతాదళ్ పార్టీ, టీడీపీ, ఒకసారి బీఆర్‌ఎస్ పార్టీ విజయం సాధించింది. 2009 వరకు ఏడు మండలాలతో ఉన్న నియోజకవర్గంలోని మిడ్జిల్, వంగూర్ మండలాలు జడ్చర్ల, అచ్చంపేట నియోజకవర్గాల్లోకి వెళ్లాయి. ప్రస్తుతం కల్వకుర్తి నియోజకవర్గం రెండు జిల్లాల్లో విస్తరించి ఉంది. 2016లో జరిగిన జిల్లాల పునర్విభజనలో కల్వకుర్తి నియోజకవర్గంలోని కల్వకుర్తి, వెల్దండ మండలాలు నాగర్‌కర్నూల్ జిల్లాలో, ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, నూతనంగా ఏర్పడిన కడ్తాల్ మండలం రంగారెడ్డి జిల్లాలో ఉన్నాయి. రాష్ట్ర ఆవిర్భావ అనంతరం జరిగిన 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్ రెడ్డి, 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్ ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. ఇదే ప్రాంతంలో బీజేపీ నుంచి పోటీ చేస్తున్న ఆచారి ఐదుసార్లు ఓడిపోగా.. 2023 ఎన్నికల్లో సైతం అతనికే పార్టీ టికెట్ లభించింది.

నియోజకవర్గంలో మండలాల వారీగా ఓటర్లు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
కడ్తాల్	16,576	15,443	0	32,019
తలకొండపల్లి	18,016	17,259	02	35,277
కల్వకుర్తి రూరల్	15,074	14,672	0	29,746
కల్వకుర్తి అర్బన్	11,902	11,864	0	23,766
వెల్దండ	15,978	15,586	01	31,565
చారకొండ	3,394	3,363	0	6,757
ఆమనగల్	15,065	14,876	0	29,941
మాడ్గుల	21,388	20,187	04	41,579
మొత్తం	1,17,393	1,13,250	07	2,30,650

నాలుగు సార్లు విజయం సాధించిన జైపాల్‌రెడ్డి

నియోజకవర్గంలో 1969 ఉప ఎన్నికల్లో జైపాల్‌రెడ్డి 1983 వరకు వరుసగా నాలుగుసార్లు విజయం సాధించారు. 1983 తర్వాత జనతాదళ్‌లోని జైపాల్‌రెడ్డి కేంద్ర రాజకీయాల్లోకి వెళ్లారు. 1984లో మొదటిసారి లోక్‌సభకు ఎన్నికైన అతను, 2004, 2009 యూపీఏ ప్రభుత్వంలో రెండు సార్లు కేంద్ర మంత్రిగా పనిచేశారు. లోక్‌సభతో పాటుగా రాజ్యసభకు నామినేట్ అయ్యి, రాజ్యసభలో 1992లో ప్రతిపక్ష నాయకుడిగా పనిచేశాడు. 1998లో ఇతనికి ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు లభించింది.

ఎన్టీఆర్‌ను సైతం..

1989లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా హవా కొనసాగుతున్న సమయంలో టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్‌ను ఓడించి చరిత్రలో నిలిచింది. అప్పటి ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్ 3,568 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కేంద్రంలో రెండు పర్యాయాలు మంత్రిగా పనిచేసిన సూదిని జైపాల్‌రెడ్డిని కల్వకుర్తి ప్రజలు నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలువగా, రాష్ట్ర మంత్రులుగా 1962లో లట్టుపల్లి వెంకట్‌రెడ్డి బూర్గుల రామకృష్ణారావు మంత్రి వర్గంలో, 1989లో జక్కుల చిత్తరంజన్ దాస్ కోట్ల విజయ్‌భాస్కర్ రెడ్డి మంత్రి వర్గంలో పనిచేశారు.


2014 ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులకు వచ్చిన ఓట్లు

అభ్యర్థి	పార్టీ	వచ్చిన ఓట్లు
చల్లా వంశీచంద్‌రెడ్డి	కాంగ్రెస్	42,229
తల్లోజు ఆచారి	బీజేపీ	42,197
గుర్కా జైపాల్‌యాదవ్	టీఆర్‌ఎస్	29,687

2018 ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులకు వచ్చిన ఓట్లు

అభ్యర్థి	పార్టీ	వచ్చిన ఓట్లు
గుర్కా జైపాల్‌యాదవ్	టీఆర్‌ఎస్	62,892
తల్లోజు ఆచారి	బీజేపీ	59,445
చల్లా వంశీచంద్‌రెడ్డి	కాంగ్రెస్	46,523





1 జైపాల్‌రెడ్డి
2 ఎడ్మ కిష్టారెడ్డి
3 చిత్తరంజన్‌దాస్
4 గుర్కా జైపాల్‌యాదవ్
5 చల్లా వంశీచంద్‌రెడ్డి

గెలుపొందిన ఎమ్మెల్యేలు ఇలా..

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పోలైన ఓట్లు	ఓడిన ప్రత్యర్థి	పోలైన ఓట్లు
1952	ఎంఎన్ రావు (కాంగ్రెస్)	28,902	ఎల్.రెడ్డి (పీపీ)	16,798
ద్విసభ	కేఆర్ వీరస్వామి (కాంగ్రెస్)	17,797	ఎన్.బాలయ్య (స్వతంత్ర)	8,030
1957	నాగన్న (కాంగ్రెస్)	21,252	బాలడు (పీడీఎఫ్)	15,269
ద్విసభ	శాంతాభాయి(కాంగ్రెస్)	18,942	మైసయ్య (స్వతంత్ర)	10,150
1962	వెంకట్‌రెడ్డి(స్వతంత్ర)	11,284	శాంతాభాయి (కాంగ్రెస్)	10,478
1964	శాంతాభాయి(కాంగ్రెస్)	19,717	జి.ఎం.రెడ్డి (సి.పి.ఐ)	7,330
1967	గోపాల్‌రెడ్డి(స్వతంత్ర)	19,289	శాంతాభాయి (కాంగ్రెస్)	14,546
1969	జైపాల్‌రెడ్డి(కాంగ్రెస్)	22,575	బి.ఎస్.రెడ్డి (ఎస్.ఎస్.పి)	18,397
1972	జైపాల్‌రెడ్డి(కాంగ్రెస్)	30,426	బి.ఎస్.రెడ్డి (ఎస్.టి.పి.ఎస్)	20,615
1978	జైపాల్‌రెడ్డి(జనతాదళ్)	36,544	కమలకాంతారావు (కాంగ్రెస్)	23,164
1983	జైపాల్‌రెడ్డి(జనతాదళ్)	46,045	రుక్మారెడ్డి (కాంగ్రెస్)	28,584
1985	చిత్తరంజన్‌దాస్(కాంగ్రెస్)	37,192	లింగారెడ్డి (జనతాదళ్)	27,754
1989	చిత్తరంజన్‌దాస్(కాంగ్రెస్)	54,354	ఎన్టీ రామారావు (టీడీపీ)	50,786
1994	ఎడ్మ కిష్టారెడ్డి(స్వతంత్ర)	38,992	గోపాల్‌రెడ్డి (స్వతంత్ర)	37,733
1999	జైపాల్‌యాదవ్ (టీడీపీ)	63,995	ఎడ్మ కిష్టారెడ్డి (కాంగ్రెస్)	60,592
2004	ఎడ్మ కిష్టారెడ్డి (కాంగ్రెస్)	76,512	ఆచారి (బీజేపీ)	54,035
2009	జైపాల్‌యాదవ్ (టీడీపీ)	56,990	ఎడ్మ కిష్టారెడ్డి (కాంగ్రెస్)	56,393
2014	వంశీచంద్‌రెడ్డి (కాంగ్రెస్)	42,229	ఆచారి (బీజేపీ)	42,197
2018	జైపాల్‌యాదవ్ (టీఆర్‌ఎస్)	62,892	ఆచారి (బీజేపీ)	59,445

పాలమూరులో బీజేపీ గెలుపు కొత్తేమి కాదు



మాట్లాడుతున్న రఘునందన్‌రావు

- ఈ 30 రోజులు దీక్ష మాదిరిగా పనిచేయండి
- కార్యకర్తలకు రఘునందన్‌రావు సూచన

పాలమూరు: పాలమూరులో బీజేపీ గెలుపు కొత్తేమి కాదని, గతంలో ఇక్కడ జరిగిన ఉపఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలిపించి చూపించిన నియోజకవర్గం అని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని సుదర్శన్ గార్డెన్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన పాలమూరు అసెంబ్లీ బూత్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డిసెంబర్ 3న వచ్చే ఫలితాలు రాష్ట్రంలో బీజేపీకి పూర్తిగా అనుకూలంగా రాబోతున్నాయని, ఆ దిశగా ప్రతి కార్యకర్త కష్టపడాలన్నారు. బీజేపీలో మాత్రమే కొత్త నాయకులకు అవకాశం ఇస్తుందని, ఈ 30 రోజుల పాటు జరిగే యుద్ధంలో సైనికుడి మాదిరిగా పనిచేసి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. బీజేపీకి బూత్ అధ్యక్షులు చాలా బలం అని, ఓటర్లతో నేరుగా కలవాలన్నారు. బూత్ అధ్యక్షుడు నూతన ఓటరు జాబితాను తీసుకుని, ఓటర్లు ఎక్కడ ఉంటున్నారో పూర్తిస్థాయిలో వివరాలు తెలుసుకోవాలన్నారు. బీజేపీ సిద్ధాంతాలను ఇంటింటికి తీసుకువెళ్లాలని, అప్పుడే విజయం సాధ్యం అవుతుందన్నారు. ప్రతి బీజేపీ కార్యకర్త రోజుకు 30 మంది ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. అంతకు ముందు మహబూబ్‌నగర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఏపీ మిథున్‌రెడ్డి మాట్లాడారు. బీజేపీ కార్యకర్తలు ప్రజల మధ్యలో తిరుగుతారని, మోదీ స్ఫూర్తితో ఎన్నికలకు వెళ్తున్నామన్నారు. ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని, ఎవరికి భయపడేది లేదని, ఏ కష్టం వచ్చినా ముందుంటానన్నారు. బీజేపీ నేతలు, కార్యకర్తలు అందరి లక్ష్యం పాలమూరు గడ్డపై కాషాయ జెండా ఎగురవేయడమేన్నారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మాచారి, పద్మజారెడ్డి, బాలరాజు, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ యాదవ్, కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎవరి దారి వారిదే..



ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి మద్దతు కోరుతున్న విజయుడు

అలంపూర్: జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలో ఇద్దరు బీఆర్‌ఎస్ అబ్యర్థులు పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. ఇప్పటికే జాబితాలో ఎమ్మెల్యే టికెట్ పొంది.. స్థానికంగా వచ్చిన వ్యతిరేకతతో బీఫాం రాని ఎమ్మెల్యే అబ్రహంతోపాటు.. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి సూచనతో టికెట్ ఆశిస్తున్న మరో నేత విజయుడు ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలో సోమవారం విజయుడు అలంపూర్ ఆలయాలను దర్శించుకున్నారు. అనంతరం కర్నూలులోని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని ఆయన నివాసంలో కలిసి మద్దతు కోరారు. ఆయన సూచనతో అలంపూర్ మున్సిపాలిటీలోని ముఖ్య నాయకులు, కార్యకర్తల ఇళ్లకు వెళ్లి తన అభ్యర్థిత్వాన్ని బలపర్చాలని కోరారు. అలాగే ఎమ్మెల్యే అబ్రహం సూచనతో ఆయన తనయుడు అజయ్, అల్లుడు ఎస్‌ఆర్‌ఐ కొంగల రవి ఆధ్వర్యంలో ప్రచార రథానికి జోగుళాంబ అమ్మవారి సన్నిధిలో పూజలు చేశారు. అలాగే స్థానిక షాఅలీ పహిల్వాన్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరిపి ప్రచారంలోకి అడుగుపెట్టడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌దే అధికారం



క్రిస్టియన్‌పల్లిలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ రూరల్/ మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎన్నికల్లో ప్రజలంతా బీఆర్‌ఎస్‌కే పట్టం కట్టేందుకు సిద్ధమయ్యారని, మళ్లీ అధికార పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అధికార పార్టీకి దరిదాపుల్లో ఏ పార్టీ కూడా లేదన్నారు. సోమవారం మండలంలోని తువ్వగడ్డ తండా, ఫతేపూర్, భవానితండా, పల్లెగడ్డ, బోడగడ్డ తండాల్లో మంత్రి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కర్ణాటకలో అక్కడి ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మితే నిండా ముంచేశారని, కనీసం కరెంట్ ఇవ్వకుండా రైతులను ఆగం చేస్తున్నారన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి సమైక్య రాష్ట్రంలో 11 సార్లు అధికారం అనుభవించి కనీసం రైతులకు రూపాయి కూడా పంట పెట్టుబడిగా ఇవ్వని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రైతుబంధును ఆపేందుకు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారన్నారు. రైతుబంధు, ఇతర సంక్షేమ పథకాలను అడ్డుకుంటున్న కాంగ్రెస్ పార్టీని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. సమైక్య రాష్ట్రంలో తండాలను గత ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని, కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్, ఎంపీపీ సుధాశ్రీ, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటేశ్వరమ్మ, సర్పంచ్‌లు అలివేలు, శంకర్, పూర్యానాయక్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు రవీందర్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, ప్రతాప్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓపిక, సహనంతో ఉండాలి

కొందరు ఓర్వలేకే దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేశారని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. సోమవారం రాత్రి స్థానిక పదో వార్డు పరిధిలోని క్రిస్టియన్‌పల్లి, అయోధ్యనగర్, ఆదర్శ నగర్ (డబుల్‌బెడ్‌రూం ఇళ్లు), శ్రీరాంకాలనీలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది ముమ్మాటికీ పిరికిపందల చర్య అని, ఇలాంటి దాడులకు భయపడమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఓపిక, సహనంతో ఉండాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, కౌన్సిలర్ రాణి, కో–ఆప్షన్ సభ్యురాలు వరలక్ష్మి, బీఆర్‌ఎస్ నాయకులు రాజు, రవి, స్వదేశ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహం

అలంపూర్: బీఆర్‌ఎస్‌లో సభ్యత్వం లేని కొందరు బీ–ఫాం తనకే వచ్చిందని అభ్యర్థి తనే అంటూ ప్రచారం చేస్తున్నారని, బీ–ఫాంపై వస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎవరు నమ్మవద్దని, బీ–ఫాం మనకే వస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహం అన్నారు. సోమవారం అలంపూర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పార్టీ అధినేత కేసీఆర్ ఎక్కడ తనను ఇబ్బంది పెట్టే చర్యలు చేయలేదని, కొందరు పనిగట్టుకొని నేను పార్టీ వీడుతున్నానని ప్రచారం చేస్తున్నారన్నారు. ఆ ప్రచారం అవాస్తవమన్నారు. సీఎం కేసీఆర్ మాటకు కట్టుబడి ఉన్నామన్నారు. దుష్ప్రచారాలపై కాకుండా గతంలో జరిగిన అభివృద్ధి ఇతరులు చేసిన అభివృద్ధిపై మాట్లాడాలన్నారు. విపక్ష పార్టీలకు మేలు చేసేలా బీ–ఫాం తమకే వచ్చిందనే తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. అభ్యర్థిగా ప్రకటించిన అధినేత బీ–ఫాం నాకే తప్పక ఇస్తారన్నారు. ప్రజలు నాయకులు, కార్యకర్తలు ఈ ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉన్నామన్నారు. అందరు సంయమనం పాటించాలన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



కబడ్డీ పోటీలో తలబడుతున్న క్రీడాకారులు

- ముగిసిన ఆలిండియా ఇన్విటేషన్ కబడ్డీ పోటీలు
- మొదటి విజేత మహబూబ్‌నగర్, రెండో స్థానం నల్లగొండ

ఆత్మకూర్: వనపర్తి జిల్లా ఆత్మకూర్ మండలంలోని మూలమల్లలో నిర్వహిస్తున్న ఆలిండియా ఇన్విటేషన్ కబడ్డీ పోటీలు సోమవారం రాత్రి రెండో రోజు ఉల్లాసంగా ఫైనల్‌మ్యాచ్‌లు ముగిశాయి. పాండురంగస్వామి సప్తాంగం, వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో కర్ణాటక, ఏపీ, తెలంగాణ నుంచి 10 జట్లు హాజరయ్యాయి. ఈ పోటీలు సోమవారం రాత్రి 12 గంటలకు కొనసాగాయి. మొదటి బహుమతి మహబూబ్‌నగర్ జట్టుకు రూ.50 వేలు, రెండోది నల్లగొండ రూ.40వేలు, మూడవది ధార్వాడ్ రూ.30వేలు, నాల్గోది వరంగల్ రూ.20వేలు, ఐదవది తూంకూర్ రూ.12 వేలు, ఆరవది మూలమళ్ల రూ.10వేలు, ఏడవది ప్యాబ్లి రూ.8 వేలు, 8వ బహుమతి ఆంధ్రా జట్టు గెలుపొందగా రూ.6 వేలు నగదుతోపాటు షీల్డులను అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రశాంతి, ఎంపీటీసీ శ్యామల, మార్కెట్ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాము, ఆనంద్‌గౌడ్, భీమన్న, రఘునాథ్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

స్థలదాతలకు సన్మానం

గ్రామానికి చెందిన దేశాయి పద్మజవెంకటేశ్వర్‌రెడ్డి, వనజా గోవర్ధన్‌రెడ్డి రూ.18 లక్షలు విలువచేసే ఎకరన్నర స్థలాన్ని కబడ్డీ క్రీడాప్రాంగణం నిమిత్తం ఉచితంగా అందజేశారు. గ్రామం నుంచి క్రీడాకారులు తయారై పేరు ప్రతిష్టలు తీసుకురావాలని స్థలదాతలు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా క్రీడాకారులు, గ్రామస్తులు వారిని ఘనంగా సత్కరించారు.

పోరాటమంతా వర్గీకరణ కోసమే



పాతపాలమూరులో ప్రజలతో కలిసి పర్యటిస్తున్న మందకృష్ణ మాదిగ

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణతో మాదిగల జీవితాల్లో వెలుగులు నింపేందుకు పోరాడుతున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ అన్నారు. సోమవారం పట్టణంలోని పాతపాలమూరులో నిర్వహించిన మాదిగల విశ్వరూప సన్నాహక మహాసభ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాతపాలమూరులో పర్యటిస్తూ స్థానిక ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఖాదరయ్య అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను అన్ని పార్టీలు సమర్థిస్తూ వస్తున్నప్పటికీ వర్గీకరణ సమస్యను పరిష్కరించడంలో విఫలమవుతున్నాయని అన్నారు. అధికారంలోకి వస్తే వర్గీకరణ చేస్తామని చెప్పిన పార్టీలు తీరా మోసం చేస్తున్నాయని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మద్దతు ప్రకటించిన పార్టీలు ఇప్పుడు మౌనం వహించి వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించేందుకు చొరవ చూపెట్టకుండా మోసగిస్తున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల గుండా ఆదిలాబాద్ టు హైదరాబాద్ పేరుతో ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం కోసమే రథయాత్ర మొదలు పెట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రధాన పార్టీలు ఎన్నికల ప్రచారం హోరెత్తిస్తుంటే తాను మాత్రం ఎస్సీ వర్గీకరణ కోసం రథయాత్రను కొనసాగిస్తున్నానని తెలిపారు. నవంబర్ 18న హైదరాబాద్‌లో బహిరంగ సభకు ఉమ్మడి పాలమూరు జిల్లా నుండి మాదిగలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బాలయ్య, యాదయ్య, కృష్ణయ్య, జంగయ్య, వెంకటస్వామి, బాలరాజు, ప్రభాకర్, రాములు, సువార్తనమ్మ, ఆంజనేయులు, శ్రీరాములు, కేశవులు, ఎల్లప్ప, కృష్ణయ్య, జంగయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓటరు నమోదుకు నేడు చివరి రోజు

ఎర్రవల్లిచౌరస్తా: 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకొనుటకు మంగళవారం అక్టోబర్31 చివరి రోజని ఎర్రవల్లి తహసీల్దార్ నందిని తెలిపారు. ఇంకా ఎవరైనా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలనుకుంటే స్థానిక బూత్ స్థాయి అధికారిని లేదా ఓటరు నమోదు అధికారిని సంప్రదించాలన్నారు. ఓటర్ హెల్ప్ లైన్ యాప్ ద్వారా కూడా ఓటరు నమోదు ప్రక్రియను చేపట్టవచ్చని ఆమె పేర్కొన్నారు.

ఎన్నికలపై అధికారులకు శిక్షణ

ఎర్రవల్లిచౌరస్తా: మండల కేంద్రంలోని ఏకశిల పాఠశాలలో మంగళవారం ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తహసీల్దార్ నందిని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అలంపూర్ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో శాసనసభ ఎన్నికల్లో విధుల నిర్వహించే పీఓ, ఏపీఓ లకు ఎన్నికలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డా.చంద్రమోహన్

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌లోని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్‌గా డా.కె.చంద్రమోహన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కమిషనర్ ఆఫ్ కాలేజీమేట్ ఎడ్యుకేషన్ (సీసీఈ) హైదరాబాద్ ఆదేశాల ప్రకారం ప్రిన్సిపాల్‌గా (ఎఫ్ఏసీ) బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్‌ను కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది శాలువా, బొకే ఇచ్చి అభినందించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలను ఉన్నతస్థాయిలో అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వివిధ పుష్పాలతో శివుడిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

నందిన్నె చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ

కేటీదొడ్డి: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు వాహనాలు ముమ్మరంగా తనిఖీ చేపట్టారు. సోమవారం మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్‌పోస్టును ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ పోలీసుల ఆధ్వర్యంలోని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి మద్యం, డబ్బులు రాకుండా అధికారులు గట్టి బందోబస్తుతో పాటు బస్సులు తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో పోలీస్ హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి, కృష్ణారెడ్డి, రాములు, ప్రేమ్‌రెడ్డి పోలీసు సిబ్బంది ఉన్నారు.

మానవపాడు: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీ ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు. సోమవారం మండలంలోని కొర్విపాడు స్టేజీ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి సంపత్‌కుమార్ వాహనాన్ని సైతం తనిఖీ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ తనిఖీలో పోలీసులు ఉన్నారు.

నాయకులపై కేసు నమోదు

గద్వాల క్రైం: ఓటర్లను ప్రలోభాలకు గురి చేసిన కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ ఆనంద్ తెలిపారు. ఈ నెల 27వ తేదీన గద్వాల మండలంలోని మదనపల్లిలో కాంగ్రెస్ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం కోసం ఓటర్లను ప్రలోభాల ద్వారా తమ వైపు ఆకర్షించేందుకు ఆ పార్టీకి చెందిన నాగిరెడ్డి హరీష్, వెంకటేష్, అంజి, సంజీవులు కల్లును సరఫరా చేస్తున్నట్లు పలు వీడియోలు సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారాయి. గుర్తించిన పోలీసులు ఆ వీడియోల ఆధారంగా ఐదుగురు నాయకులపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బెల్ట్ షాపులో మద్యం పట్టివేత

మానవపాడు: ఎన్నికల నేపథ్యంలో బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాము తెలిపారు. సోమవారం మండలంలోని కొర్విపాడు, చంద్రశేఖర్‌నగర్ గ్రామాలలో బెల్ట్‌షాపుల్లో తనిఖీ చేశారు. కొర్విపాడు లక్ష్మన్నగౌడ్ ఇంట్లోని మద్యం 17 లీటర్లు పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వాటి విలువ రూ.18వేలు ఉంటుందన్నారు. తనిఖీలో హెడ్‌కానిస్టేబుల్ తిప్పన్న, పోలీస్‌లు ఉన్నారు.

1న సర్వసభ్య సమావేశం

మానవపాడు: మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ అధ్యక్షుల ఆధ్వర్యంలో బుధవారం 1వ తేదీన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు సోమవారం ఎంపీడీఓ రమణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండల స్థాయి అధికారులు హాజరు కావాలని తెలిపారు.

ప్చ్.. మార్పు రావట్లే!

- అటకెక్కిన నిషేధం
- యథేచ్ఛగా ప్లాస్టిక్ వినియోగం
- నియంత్రణ చర్యలపై నిర్లక్ష్యం


డ్రెయినేజీలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు (ఫైల్)


దుకాణాల్లో తనిఖీ చేస్తున్న మున్సిపల్ అధికారులు (ఫైల్)

గద్వాల: గతేడాది జూలై 1 నుంచి ఒకసారి వాడిపారేసే వస్తువులను నిషేధిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీ చేశాయి. అప్పటి నుంచి కఠిన ఆంక్షలు అమల్లోకి రాగా తనిఖీలు చేస్తూ చర్యలు చేపట్టారు. కొద్ది రోజుల పాటు హడావుడి చేసిన అధికార యంత్రాంగం ఆ తర్వాత అటకెక్కింది. జిల్లాలోని గద్వాల, అయిజ, అలంపూర్, వడ్డేపల్లి మున్సిపాలిటీలలో ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ సంచులను, వస్తువులను పూర్తిగా నిషేధించారు. 120 మైక్రాన్లలోపు ఉండే కవర్లను, వస్తువులను తయారు చేయడం, అమ్మడం, వినియోగించుకోవడానికి వీలు లేదు. నిషేధించిన మొదట్లో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతూ వ్యాపారుల దగ్గర ఉన్న పాలిథిన్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. కొంతమందికి జరిమానా సైతం విధిస్తూ ఉక్కుపాదం మోపారు.

మార్పు వచ్చే సమయంలో..

జిల్లా కేంద్రంలో ప్లాస్టిక్ నిషేధించడంతో వ్యాపారులు సైతం పాలిథిన్ కవర్ల వినియోగించడాన్ని నిలిపేశారు. చేతి సంచులు తీసుకురావాలని వ్యాపారులు ప్రజలకు సూచించడంతో ఇంటి నుంచే సంచులు తీసుకెళ్లడం ప్రారంభించారు. ఈ క్రమంలో వ్యాపారులు అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు తీసుకరాడంతో చేసేదేమీ లేక వెనక్కి తగ్గి తనిఖీలు నిలిపేశారు. ఆ తర్వాత వ్యాపారులు అన్ని వస్తువులు ప్లాస్టిక్ కవర్లలో ఇస్తుండటంతో మళ్లీ మొదటికొచ్చింది. మున్సిపాలిటీల్లో తనిఖీలు వదిలేయడంతో ఎక్కడ చూసినా ప్లాస్టిక్‌మయమైంది. కూరగాయలు, పూలు, పండ్ల వ్యాపారులు పల్చని సంచులు వాడటం, ఏ శుభకార్యం జరిగినా కల్యాణ మండపాలు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, కర్రీ పాయింట్ల నుంచి ప్యాకింగ్ సంచులు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు, చెంచాలు, కప్పులు వేల సంఖ్యలో బయటకు వస్తున్నాయి. దుకాణాల్లో ఒకసారి వాడి పడేసే వస్తువులు, కవర్ల విక్రయం, వినియోగం యథేచ్ఛగా సాగుతోంది. అయిజ, అలంపూర్, వడ్డేపల్లి మున్సిపాలిటీలలో సైతం ఆర్భాటమే తప్ప, ఆచరణ కనిపించడం లేదు. కేవలం చెత్త సేకరణ ట్రాక్టర్ల మైకు ద్వారానే ప్రచారం చేస్తున్నారు. తప్పితే క్షేత్రస్థాయిలో ప్లాస్టిక్ నిషేధానికి తీసుకున్న చర్యలు కనిపించడం లేదు.

కమిటీ, తనిఖీలు ఏమైనట్లు?

ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ సంచులను, వస్తువులను పూర్తిగా నిషేధించడంతో మున్సిపాలిటీల్లో అమలు చేసేందుకు సిటీ లెవల్ టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశారు. ఇందులో కమిషనర్, శానిటరీ సూపర్‌వైజర్లు, పోలీసు కానిస్టేబుల్ కమిటీలో ఉంటారు. వీరంతా రోజు పరిశీలించడంతో పాటు ప్రజలకు ప్రత్యామ్నాయంగా వాడుకునే వస్తువులను వివరించాల్సి ఉంటుంది. ఈ కమిటీ ఎక్కడ ఉందో కనిపించడం లేదు.

స్వచ్ఛ ర్యాంకులపై ప్రభావం..

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో ప్లాస్టిక్ నిషేధం అమలుతో పాటు ప్రజల్లో అవగాహన కలిగించేలా తీసుకుంటున్న చర్యలకు మార్కులు కేటాయిస్తారు. ప్రస్తుతం మున్సిపల్ పట్టణాల్లో నెలకొన్న పరిస్థితులను చూస్తే ఈ విభాగంలో ఎక్కడా మార్కులు పడే అవకాశం కనిపించడం లేదు.

అవగాహన కల్పిస్తున్నాం..



గతేడాది నుంచే ప్లాస్టిక్ సంచుల నిషేధం అమల్లోకి వచ్చింది. ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడుతున్నాం. అధికారులు, సిబ్బంది కలిసి దాడులు చేసి ప్లాస్టిక్ విక్రయాలను అడ్డుకుంటున్నాం. ప్రజల్లో మార్పు వచ్చినప్పుడే నిర్మూలన సాధ్యమవుతుంది. ప్లాస్టిక్ విక్రయాలు చేస్తే జరిమానాతో పాటు దుకాణం లైసెన్స్ రద్దు చేస్తాం.

– నర్సింహ, కమిషనర్, గద్వాల

కాంగ్రెస్ మాటలు నమ్మొద్దు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

కేటీదొడ్డి: కాంగ్రెస్ నాయకులు చేప్పే మాయమాటలు నమ్మొద్దని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ప్రజలను కోరారు. సోమవారం మండలంలోని నందిన్నెలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై కాంగ్రెస్, బీజేపీ నాయకులు పార్టీలో చేరుతున్నారన్నారు. అనంతరం బీజేపీ సర్పంచ్ చిన్నబీమరాయుడు ఆయన అనుచరులతో పాటు 300 మందిని బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప, సీనియర్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్ఎంపీపీ రామకృష్ణనాయుడు, మండల అధ్యక్షుడు ఉరుకుందు, చక్రధర్, గబ్బర్ వీరన్న, రంగారెడ్డి పాల్గొన్నారు.

గద్వాల అర్బన్: కొంతమంది రకరకాల వేషాలు వేసుకోని కల్లిబొల్లి మాటలతో మభ్యపెట్టేందుకు వస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గద్వాల మండలంలోని చెనుగోనిపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గతంలో వ్యవసాయ పొలాల్లో కరెంటు మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయేవని చెప్పారు. సీఎం కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప, ఎంపీపీ ప్రతాప్ గౌడ్, వైస్ ఎంపీపీ దామోదర్ రెడ్డి, మాజీడ్, ఎంపీటీసీ సరోజమ్మ, నాయకులు రాముడు, రమేష్ నాయుడు, రంగన్న, సర్వారెడ్డి ఉన్నారు.

గద్వాల అభివృద్ధే బీఆర్ఎస్ లక్ష్యం

గట్టు: గద్వాలను అన్ని విధాలుగా అభివృద్ధి పరచడమే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జంబురామన్‌గౌడు, ఎంపీపీ విజయ్‌కుమార్, ఎమ్మెల్యే కుమారుడు సాయిసాకేత్ రెడ్డి తెలిపారు. తప్పెట్లమొర్సులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచు కృష్ణయ్యగౌడు, ఎంపీటీసీ పారిజాతమ్మ, నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, అంగడి బస్వరాజు, విజయ్, రామకృష్ణ, వెంకటేష్, గద్వాల తిమ్మప్ప, అశోక్‌కుమార్ నర్సింహులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



రాజోళి: మాజీ సర్పంచ్ శ్రీరామ్ జ్ఞాపకార్థం ఆయన కుమారులు వంశీదర్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి కుటుంబ సభ్యులు స్కూల్ విద్యార్థులకు బ్యాగులు అందజేశారు. విద్యార్థులకు శ్రీరామ్‌రెడ్డి గతంలో పుస్తకాలు, బ్యాగులు అందివ్వడంతో పాటు, పాఠశాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేసే వారని తెలిపారు. కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు కిరణ్‌రెడ్డి, గంగిరెడ్డి, రశీద్ పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు కనీస వసతుల్లేవ్..

ఉండవెల్లి: మండలంలోని బైరాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు బాత్రూంలు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు. బాలికలకు సైతం వసతులు అరకొరగా ఉన్నాయని తెలిపారు. బాలుకలకు బాత్రూంలు ఉన్నాయని, బాలురకు లేవని ఆరుబయటకు వెళ్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ తెలిపారు. బాలురకు బాత్రూంల ఏర్పాటుపై ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

ఆస్పత్రిలో సాధారణ కాన్పులు చేయాలి


మాట్లాడుతున్న ఎంపీహెచ్ఓ సత్యనారాయణ

మానవపాడు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సాధారణ కాన్పులు చేయాలని ఎంపీహెచ్ఓ సత్యానారాయణ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎమ్‌లకు, ఆశలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకేంద్రాలలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి రక్త నమూనాలు సేకరించారు. రక్తహీనత ఉన్నవారికి ఐరన్ మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. 3నెలల నుంచి 6నెలల వరకు 9నెలల నుంచి 12, 15నెలల పిల్లలకు పెరుగుదల దశలు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో చంద్రన్న, సంధ్యారాణి, తిరుమల్‌రావు, సోని, సంధ్య, అనూష, పరిమళ, రసీదు ఆశలు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటు పనులు ప్రారంభం



జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులకు కనువిందు చేలిగేలా, క్షేత్రానికి దారి చూపే మార్గంతో పాటు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించేందుకు బూడిదపాడు, బైరాపురం చౌరస్తా దగ్గర శివపార్వతి, నంది విగ్రహాల ఏర్పాటుకు సోమవారం పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులను దేవస్థానం ఉద్యోగి శ్రీకాంత్ ప్రారంభించారు. జోగుళాంబ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బండిశ్రీనివాస్ బైరాపురం చౌరస్తా దగ్గర విగ్రహాన్ని ఏర్పాటు చేయిస్తున్నారు.

క్యాన్సర్ పరీక్షల్లో పొరపాట్లకు తావివ్వొద్దు


ఆశ కార్యకర్తలకు సూచనలిస్తున్న రాజు

అయిజ: మహిళలకు క్యాన్సర్ పరీక్షలు చేయించే సమయంలో పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ రాజు అన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అయిజలో సోమవారం ఆశా కార్యకర్తల సమీక్ష సమావేశం డాక్టర్ విష్ణు ఆధ్వర్యంలో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎన్సిడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆశ కార్యకర్తలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్, సర్వేకల్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్ వస్తుందని, అటువంటి వారిని ముందుగానే గుర్తించి ఆరోగ్యం క్షీణించకుండా చూసుకోవాలన్నారు. వారంలో మూడు రోజులపాటు స్క్రీనింగ్ టెస్టులు వుంటాయని, రోజుకు 30 మంది చొప్పున తీసుకువచ్చి స్క్రీనింగ్ చేయించాలని ఆశ కార్యకర్తలను ఆదేశించారు. అంతేగాక ఏఎస్ఎంలకు ఆశ కార్యకర్తలు సహకరించాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఎన్సిడి ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్యాంసుందర్, మక్బుద్, ఎంపీహెచ్ఈఓ ఓబులేష్, సూపర్‌వైజర్లు నిర్మల, శోభ, ఆయా గ్రామాలకు చెందిన ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానికులకు అవకాశం ఇవ్వండి


కిషన్‌రెడ్డితో మాట్లాడుతున్న మాదన్న

అయిజ: అలంపూర్ సెగ్మెంట్ బీజేపీ సీటు ఈసారైనా స్థానికులకు కేటాయించాలని ఆ పార్టీ ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు అయిజ మాదన్న బీజేపీ నాయకులను కోరారు. బీజేపీ టికెట్ విషయమై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఇన్‌చార్జ్ తరుణ్‌చుగ్, ఎమ్మెల్యే ఈటెల రాజేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావును కలిసినట్లు ఆయన తెలిపారు. తనకు అవకాశం ఇస్తే అందరు నాయకుల సహకారంతో అలంపూర్‌లో గెలిస్తామని రాష్ట్ర, జిల్లా నాయకులకు విజ్ఞప్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి


శాంతినగర్‌లో ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు

శాంతినగర్: బర్రెలు, గొర్రెలు మాకొద్దు, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలని నిరుద్యోగులుబిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లో నిరుద్యోగులు ప్లకార్డులు పట్టుకుని అలంపూర్-రాయచూర్ రోడ్డుపై నిరసన తెలిపారు. సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం దుకాణాలకు వెళ్లి భిక్షాటన కొనసాగించారు. బంగారు తెలంగాణలో నిరుద్యోగుల బతుకులు అధ్వానం మారాయని, ఏ ప్రభుత్వమైనా నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని అటువంటి వారికే మద్దతు తెలుపుతామని ప్రకటించారు. నిరుద్యోగుల నిరసనకు మద్దతుగా అలంపూర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సంపత్‌కుమార్ సంఘీబావం తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఉద్యోగాలు భర్తీచేసి న్యాయం చేస్తామని వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వడ్డేపల్లి మున్సిపాలిటీ, ఆయా గ్రామాలకు చెందిన నిరుద్యోగులు పాల్గొన్నారు.

అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా


జిల్లా కేంద్రంలో బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

గద్వాల అర్బన్/మల్దకల్: ఎమ్మెల్యేగా ఒక అవకాశం ఇవ్వాలని, గద్వాల నియోజక వర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, చూపుతామని జెడ్పీచైర్ పర్సన్ సరిత అన్నారు. సోమవారం మండలంలోని చెర్లగార్లపాడు, విఠాలపురం, చిప్పదొడ్డి, మద్దెలబండ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని, గత పాలకులు ఒకే కుటుంబానికి చెందిన వారు నాయకత్వం వహించారని, తమ కుటుంబాల అభివృద్ధి కోసం ప్రజల సంక్షేమాన్ని విస్మరించినట్లు ఆరోపించారు. బడుగు, బలహీన వర్గాల, బహుజన బిడ్డగా కాంగ్రెస్ పార్టీ తరపున పోటీలో ఉన్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ, ఉద్యోగ అవకాశాలు, ప్రాజెక్టులు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆరు గ్యారెంటీ పథకాలను అధికారంలోకి రాగానే అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మధుసూదన్‌బాబు, బండ్ల రాజశేఖర్‌రెడ్డి, శంకర్, నల్లారెడ్డి, వెంకట్రామిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గొవిందు, కృష్ణారెడ్డి, షేక్షావ లి, లోకన్న, మహెబూబ్, సిద్దయ్య, సలీం, మల్లికార్జున్‌గౌడు, జనార్థన్‌గౌడు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

జిల్లా కేంద్రంలోని జెడ్పీ చైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయంలో గట్టు మండలం చిన్నొనిపల్లి, అలూరు, ధరూర్, గద్వాల మండలంలోని పరుమాల గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు జెడ్పీచైర్‌పర్సన్ సరిత ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అదేవిధంగా బిజేపీ ఎస్టీ మోర్చా పట్టణ అధ్యక్షుడు అనిల్ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

గట్టు: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని జెడ్పీ చైర్ పర్సన్ సరిత అన్నారు. మండల కేంద్రంలోని ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ పెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి దిశ నిర్దేశం చేయాలని, కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో గోవిందప్ప, కృష్ణమూర్తి, సత్యనారాయణ, మధుసూదన్‌బాబు, ఎస్ కృష్ణ, బండ్ల రాజశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అలంపూర్‌లో కాంగ్రెస్ ప్రచారం


మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి సంపత్ కుమార్

అలంపూర్: ప్రజలు ఆశీర్వదించి అసెంబ్లీకి పంపితే అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ సంపత్ కుమార్ అన్నారు. అలంపూర్ మున్సిపాలిటీలో సోమవారం రాత్రి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలోని పెద్ద దర్గా నుంచి అక్బర్‌పేట మీదుగా ప్రచారం చేశారు. గాంధీచౌక్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి ఉన్నారు.

రాజోళి: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే మహిళల అభ్యున్నతి సాధ్యమని అలంపూర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సతీమణి మహాలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో ఆమె ప్రచారం నిర్వహించారు. అలంపూర్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న సంపత్ కుమార్‌ను గెలిపించాలని, అధికారంలోకి రాగానే మహిళల కోసం తీసుకొచ్చిన పథకాలు అమలు చేసి, అభివృద్ధిలోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో దస్తగిరి, రాధమ్మ ఉన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి


మల్దకల్‌లో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సిద్దప్ప

మల్దకల్: టీబీ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి వారి ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ సిద్దప్ప వైద్య సిబ్బందికి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోజు వివిధ గ్రామాల నుంచి వచ్చే రోగులకు అందజేస్తున్న సేవలపై డాక్టర్ స్వరూపరాణిని అడిగి తెలుసుకున్నారు. మండలంలో మొత్తం టీబీ, షుగర్, బీపీ, క్యాన్సర్, కుష్టి వంటి రోగాలతో బాధపడుతున్న వారికి వైద్యసిబ్బంది అందజేస్తున్న సేవలు, మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామాల్లో 18 ఏళ్ల నిండిన మహిళలు వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి, సరైన వైద్యం అందించే విధంగా సిబ్బంది చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా వైద్య సిబ్బంది వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు స్వరూపరాణి, జయమ్మ, వరలక్ష్మి, సూపర్ వేజర్లు సత్యమ్మ, శ్రీధర్, జ్యోతి, ఏఎస్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు


ధరూరులో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

ధరూరు: మండలంలోని ఆయా గ్రామాలతో పాటు మండల కేంద్రంలో కేంద్ర బలగాల కవాతు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ రితిరాజ్ ఆదేశానుసారం కేంద్ర బలగాలు సమస్యాత్మక గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్నాయి. మండల సబ్ ఇన్‌స్పెక్టర్ శివానందంగౌడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రం, మన్నాపురం, చింతరేవుల, రేవులపల్లిలో పుర వీధులు తిరుగుతూ ర్యాలీ ని ర్వహించారు. ధరూరులో వైఎస్సార్ చౌక్, హెచ్‌పీ పెట్రోల్ బంక్, పాత బస్టాండు, అంబేద్కర్ చౌరస్తా, భారత్ పెట్రోల్ బంక్, రాయచూరు ప్రధాన రోడ్డు, జూరాల డ్యాం రోడ్డు గుండా ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్ఐ శివానందం గౌడ్, గద్వాల సీఐ శ్రీనివాసులు మాట్లాడారు. వచ్చే నెల 30న జరగబోయే ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.

మల్దకల్: మండలంలోని అమరవాయి, బిజ్వారం, ఉలిగేపల్లి గ్రామాల్లో సోమవారం సీఐ శ్రీనివాస్, ఎస్ఐ కల్యాణ్‌కుమార్ ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్ పోలీసులు కవాతు నిర్వహించారు. సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో శాంతియుత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కు ను నిర్భయంగా వినియోగించుకునేందుకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల్లోని పురవీధుల గుండా 60 సీఆర్పీఎఫ్ పో లీసులు తిరుగుతూ ప్రజల్లోఉన్న భయాన్ని తొలగించారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

ఆశాల హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న వీవీ నర్సింహ

గద్వాల అర్బన్: ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి సునీత ఆధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు చెల్లించాలని, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, రిటైర్మేంట్ బెనిఫిట్స్, ఆరు నెలల పీఆర్సీ ఫండ్ బకాయిలు ఇవ్వాలని కోరారు. అనంతరం ఆ సంఘం జిల్లా కార్యదర్శి సునీత మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఆశావర్కర్లు ప్రభుత్వం ఇచ్చిన హామీలు పరిష్కరించకుంటే మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు కాంతమ్మ, సరస్వతి, పద్మ, నర్సమ్మ, మాధవి, సునీత ఉన్నారు.

గొర్రెలు, మేకలకు పీపీఆర్ టీకాలు


గొర్రెలకు వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్య సిబ్బంది

అయిజ: మండల పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పులికల్ గ్రామంలో సోమవారం గొర్రెలకు పీపీఆర్ వ్యాక్సిన్ వేశారు. ఐదు మంది జీవాల యజమానులకు సంబంధించి 902 గొర్రెలు, 20 మేకలకు వ్యాక్సిన్ వేసినట్లు పశువైద్యులు తెలిపారు. అందరు జీవాల యజమానులు వారికి సంబంధించిన గొర్రెలు, మేకలకు పీపీఆర్ టీకాలు వేయించుకోవాలని కోరారు.

ఉండవెల్లి: మండలంలోని మండల కేంద్రం, మారమునగాల, బొంకూరు గ్రామాల్లోని 2,200 గొర్రెలకు, 180 మేకలకు పీపీఆర్ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి శిరీష తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది శివ పాల్గొన్నారు.




సబలెంకా శుభారంభం

మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో గత ఏడాది రన్నరప్, ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా (బెలారస్) శుభారంభం చేసింది. మెక్సికోలో జరుగుతున్న ఈ టోర్నీలో తొలి లీగ్ మ్యాచ్‌లో సబలెంకా 6-0, 6-1తో మరియా సాకరి (గ్రీస్)పై గెలిచింది. 74 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సబలెంకా ఆరు ఏస్‌లు సంధించి, తన ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. మరో లీగ్ మ్యాచ్‌లో జెస్సికా పెగులా (అమెరికా) 7-5, 6-2తో రిబాకినా (కజకిస్తాన్)పై విజయం సాధించింది.

అర్జున్‌కు మూడో గెలుపు

గ్రాండ్ స్విస్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ మూడో విజయం నమోదు చేశాడు. యూకేలోని ఐల్ ఆఫ్ మ్యాన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో ఐదో రౌండ్ గేమ్‌లో తెల్లపావులతో ఆడిన అర్జున్ 68 ఎత్తుల్లో రినాత్ జుమాబయేవ్ (కజకిస్తాన్)పై గెలుపొందాడు. ఐదో రౌండ్ తర్వాత అర్జున్ నాలుగు పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి ఉమ్మడిగా టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు.





ఫారూఖీ

ప్రపంచకప్‌లో నేడు

పాకిస్తాన్ X బంగ్లాదేశ్

వేదిక: కోల్‌కతా

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	6	6	0	12	1.405
దక్షిణాఫ్రికా	6	5	1	10	2.032
న్యూజిలాండ్	6	4	2	8	1.232
ఆస్ట్రేలియా	6	4	2	8	0.970
అఫ్గానిస్తాన్	6	3	3	6	-0.718
శ్రీలంక	6	2	4	4	-0.275
పాకిస్తాన్	6	2	4	4	-0.387
నెదర్లాండ్స్	6	2	4	4	-1.277
బంగ్లాదేశ్	6	1	5	2	-1.338
ఇంగ్లండ్	6	1	5	2	-1.652

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

అఫ్గాన్ తీన్‌మార్...

- శ్రీలంకపై ఏడు వికెట్లతో సంచలన విజయం
- ఒకే టోర్నీలో మూడు ప్రపంచ చాంపియన్ జట్లను ఓడించిన హష్మతుల్లా బృందం
- బంతితో మెరిసిన ఫారూఖీ
- రహ్మత్ షా, హష్మతుల్లా, అజ్మతుల్లా అర్ధ సెంచరీలు

ఇకపై తమ జట్టును కూనగా పరిగణించాల్సిన అవసరం లేదని అఫ్గానిస్తాన్ చాటి చెప్పింది. మేటి జట్లపై తాము సాధిస్తున్న విజయాలు గాలివాటమేమీ కాదని తమ నిలకడైన ప్రదర్శనతో నిరూపించింది. మూడోసారి వన్డే ప్రపంచకప్‌లో ఆడుతున్న అఫ్గానిస్తాన్ ఈసారి తమకంటే అన్ని విభాగాల్లో ఎంతో మెరుగైన జట్లను బోల్తా కొట్టిస్తూ ఔరా అనిపించింది. డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను కంగుతినిపించిన ఉత్సాహంతో 1992 విశ్వవిజేత పాకిస్తాన్ జట్టును కూడా మట్టికరిపించిన అఫ్గానిస్తాన్ జట్టు తాజాగా 1996 ప్రపంచ చాంపియన్ శ్రీలంకను ఓడించి అందర్నీ ఆశ్చర్యపరిచింది.



అజ్మతుల్లా



రహ్మత్ షా



హష్మతుల్లా

పుణే: ప్రత్యర్థి జట్టు గత రికార్డు ఎలా ఉంటేనేమి తమదైన రోజున సమష్టిగా గర్జిస్తే అద్భుత ఫలితం సాధించవచ్చని వన్డే ప్రపంచకప్ టోర్నీలో అఫ్గానిస్తాన్ జట్టు మూడోసారి నిరూపించింది. భారీ అంచనాలు పెట్టుకోకుండా ఈ మెగా ఈవెంట్‌లో బరిలోకి దిగిన అఫ్గానిస్తాన్ మూడో సంచలన విజయంతో అలరించింది. 1996 ప్రపంచ చాంపియన్ శ్రీలంక జట్టుతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో హష్మతుల్లా షాహిది నాయకత్వంలోని అఫ్గానిస్తాన్ జట్టు ఏడు వికెట్ల తేడాతో గెలిచి అబ్బురపరిచింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 49.3 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌటైంది. నిసాంక (60 బంతుల్లో 49; 5 ఫోర్లు), కెప్టెన్ కుశాల్ మెండిస్ (50 బంతుల్లో 39; 3 ఫోర్లు), సమరవిక్రమ (40 బంతుల్లో 36; 3 ఫోర్లు), తీక్షణ (31 బంతుల్లో 29; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఫజల్‌హక్ ఫారూఖీ (4/34) శ్రీలంక జట్టును దెబ్బ తీశాడు. ఒకదశలో 134/2తో పటిష్టస్థితిలో కనిపించిన శ్రీలంక నిసాంక అవుటయ్యాక తడబడింది. 107 పరుగుల తేడాలో ఏడు వికెట్లు కోల్పోయింది. కెరీర్‌లో 100వ వన్డే ఆడిన రషీద్ ఖాన్ ఒక వికెట్ తీయగా, మరో స్పిన్నర్ ముజీబ్‌కు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం 242 పరుగుల విజయ లక్ష్యాన్ని అఫ్గానిస్తాన్ 45.2 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ గుర్బాజ్ (0) డకౌట్‌కాగా... రహ్మత్ షా (74 బంతుల్లో 62; 7 ఫోర్లు), హష్మతుల్లా షాహిది (74 బంతుల్లో 58 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్), అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (63 బంతుల్లో 73 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో అఫ్గానిస్తాన్ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. హష్మతుల్లా, అజ్మతుల్లా నాలుగో వికెట్‌కు అజేయంగా 111 పరుగులు జోడించడం విశేషం.

ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లో భారత్ చేతిలో ఓడిపోయిన అఫ్గానిస్తాన్... రెండో మ్యాచ్‌లో 69 పరుగుల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను ఓడించి బోణీ కొట్టింది. మూడో మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో 149 పరుగుల తేడాతో ఓడిపోయి... నాలుగో మ్యాచ్‌లో విజృంభించి 1992 విశ్వవిజేత పాకిస్తాన్‌పై ఏకంగా 8 వికెట్ల తేడాతో గెలిచింది. అనంతరం అదే ఉత్సాహంతో శ్రీలంకను కూడా మట్టికరిపించి అఫ్గానిస్తాన్ పాయింట్ల పట్టికలో ఐదో స్థానానికి ఎగబాకింది. మూడోసారి వన్డే వరల్డ్‌కప్‌లో ఆడుతున్న అఫ్గానిస్తాన్ ఒకే ప్రపంచకప్‌లో మూడు విజయాలు సాధించడం ఇదే ప్రథమం. 2015 ప్రపంచకప్‌లో ఒక మ్యాచ్‌లో నెగ్గిన అఫ్గానిస్తాన్... 2019 ప్రపంచకప్‌లో ఆడిన తొమ్మిది మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయింది. ఈ ప్రపంచకప్‌లో మాత్రం అఫ్గానిస్తాన్ తమ కంటే మెరుగైన జట్లకు చెమటలు పట్టిస్తోంది. ఈ టోర్నీలో అఫ్గానిస్తాన్ మిగిలిన మూడు మ్యాచ్‌లను నెదర్లాండ్స్ (నవంబర్ 3న), ఆస్ట్రేలియా (నవంబర్ 7న), దక్షిణాఫ్రికా (నవంబర్ 10న) జట్లతో ఆడుతుంది.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) గుర్బాజ్ (బి) అజ్మతుల్లా 46; దిముత్ కరుణరత్నే (ఎల్బీ డబ్ల్యూ) (బి) ఫారూఖీ 15; కుశాల్ మెండిస్ (సి) నజీబుల్లా (సబ్) (బి) ముజీబ్ 39; సమరవిక్రమ (ఎల్బీడబ్ల్యూ) (బి) ముజీబ్ 36; అసలంక (సి) రషీద్ ఖాన్ (బి) ఫారూఖీ 22; ధనంజయ డిసిల్వా (బి) రషీద్ ఖాన్ 14; ఎంజెలో మాథ్యూస్ (సి) నబీ (బి) ఫారూఖీ 23; చమీర (రనౌట్) 1; తీక్షణ (బి) ఫారూఖీ 29; కసున్ రజిత (రనౌట్) 5; మదుషంక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్) 241.** వికెట్ల పతనం: 1-22, 2-84, 3-134, 4-139, 5-167, 6-180, 7-185, 8-230, 9-239, 10-241. **బౌలింగ్:** ముజీబ్ ఉర్ రెహ్మాన్ 10-0-38-2, ఫజల్లఖ్ ఫారూఖీ 10-1-34-4, నవీన్ ఉల్ హక్ 6.3-0-47-0, అజ్మతుల్లా ఒమర్‌జాయ్ 7-0-37-1, రషీద్ ఖాన్ 10-0-50-1, నబీ 6-0-33-0.

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: రహ్మానుల్లా గుర్బాజ్ (బి) మదుషంక 0; ఇబ్రహీమ్ జద్రాన్ (సి) కరుణరత్నే (బి) మదుషంక 39; రహ్మత్ షా (సి) కరుణరత్నే (బి) రజిత 62; హష్మతుల్లా షాహిది (నాటౌట్) 58; అజ్మతుల్లా (నాటౌట్) 73; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (45.2 ఓవర్లలో మూడు వికెట్లకు) 242.** వికెట్ల పతనం: 1-0, 2-73, 3-131. **బౌలింగ్:** మదుషంక 9-0-48-2, రజిత 10-0-48-1, మాథ్యూస్ 3-0-18-0, చమీర 9.2-0-51-0, తీక్షణ 10-0-55-0, ధనంజయ డిసిల్వా 4-0-21-0.

అనీశ్ డబుల్ ధమాకా


కాంస్య పతకంతోపాటు పారిస్ ఒలింపిక్ బెర్త్ సొంతం



చాంగ్వాన్ (దక్షిణ కొరియా): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల పతకాల వేట కొనసాగుతోంది. సోమవారం జరిగిన పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత యువ షూటర్ అనీశ్ భన్వాలా కాంస్య పతకం సాధించాడు. ఆరుగురి మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో 21 ఏళ్ల అనీశ్ 28 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంతో ముగించాడు. ఈ ప్రదర్శనతో అనీశ్ వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌ను కూడా ఖరారు చేసుకున్నాడు. ఇప్పటి వరకు షూటింగ్‌లో భారత్‌కు 12 ఒలింపిక్ బెర్త్‌లు లభించాయి. మరోవైపు పురుషుల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో హైదరాబాద్ షూటర్ కైనన్ షెనాయ్, జొరావర్ సింగ్ సంధూ, పృథ్వీరాజ్ తొండైమన్‌లతో కూడిన భారత జట్టుకు రజత పతకం దక్కింది. కైనన్, జొరావర్, పృథ్వీరాజ్ బృందం 341 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచింది. ఇప్పటి వరకు ఈ టోర్నీలో భారత్ 30 పతకాలు సాధించింది.

వెర్‌స్టాపెన్ రికార్డు

ఈ సీజన్‌లో 16వ విజయం



మెక్సికో సిటీ: ఇప్పటికే ప్రపంచ డ్రైవర్స్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను సొంతం చేసుకున్నప్పటికీ... రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ మాత్రం ఫార్ములావన్-2023 సీజన్‌లో ఎదురులేకుండా దూసుకుపోతున్నాడు. మెక్సికో గ్రాండ్‌ప్రి రేసులో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. 71 ల్యాప్‌ల ప్రధాన రేసును మూడో స్థానం నుంచి ప్రారంభించిన వెర్‌స్టాపెన్ తొలి మలుపు వద్ద ప్రత్యర్థి డ్రైవర్లను ఓవర్‌టేక్ చేసి ఆధిక్యంలోకి వచ్చాడు. ఆ తర్వాత రేసు చివరిదాకా ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. వెర్‌స్టాపెన్ 71 ల్యాప్‌లను అందరికంటే వేగంగా 2 గంటల 2 నిమిషాల 30.814 సెకన్లలో పూర్తి చేసి విజేతగా నిలిచాడు. ఈ సీజన్‌లో వెర్‌స్టాపెన్‌కిది 16వ గెలుపు కావడం విశేషం. తద్వారా ఒకే ఏడాది అత్యధిక ఎఫ్1 రేసుల్లో గెలిచిన డ్రైవర్‌గా తన పేరిటే ఉన్న రికార్డును వెర్‌స్టాపెన్ బద్దలు కొట్టాడు. గత ఏడాది వెర్‌స్టాపెన్ 15 రేసుల్లో గెలుపొందాడు. ఓవరాల్‌గా వెర్‌స్టాపెన్ కెరీర్‌లో ఇది 51వ విజయం. ఈ క్రమంలో కెరీర్‌లో అత్యధిక ఎఫ్1 విజయాలు సాధించిన డ్రైవర్ల జాబితాలో నాలుగో స్థానంలో ఉన్న అలైన్ ప్రాస్ట్ (ఫ్రాన్స్) సరసన నిలిచాడు.

లెక్క సరిచేసిన భారత్



రాంచీ: ఆసియా మహిళల హాకీ చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు వరుసగా మూడో విజయంతో 'హ్యాట్రిక్' సాధించింది. చైనా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 2-1 గోల్స్ తేడాతో నెగ్గింది. భారత్ తరఫున దీపిక (15వ ని.లో), సలీమా టెటె (26వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. చైనా జట్టుకు జాంగ్ జియాకి (41వ ని.లో) ఒక గోల్ అందించింది. ఈ గెలుపుతో ఇటీవల హాంగ్జౌ ఆసియా క్రీడల్లో చైనా జట్టు చేతిలో సెమీఫైనల్లో ఎదురైన ఓటమికి భారత్ బదులు తీర్చుకుంది.

జ్యోతి యర్రాజీకి స్వర్ణం



పనాజీ: జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్‌కు మూడో స్వర్ణ పతకం లభించింది. సోమవారం జరిగిన అథ్లెటిక్స్ ఈవెంట్‌లో మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి యర్రాజీ చాంపియన్‌గా అవతరించింది. విశాఖపట్నం జిల్లాకు చెందిన జ్యోతి 13.22 సెకన్లలో అందరికంటే వేగంగా ఫైనల్ రేసును ముగించి అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు తెలంగాణ ఖాతాలో 11వ పతకం చేరింది. మహిళల స్విమ్మింగ్ 800 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో వ్రితి అగర్వాల్ రజత పతకం సాధించింది.

సినిమా



● మృణాల్ ఠాకూర్, నాని

అమ్మాడీ...

మాట రూపంలో కాకుండా ఇంకాస్త ఎక్కువగా ప్రేమను వ్యక్తపరచాలనుకున్నప్పుడు హీరో హీరోయిన్ పాట పాడుకోవడం చూస్తుంటాం. మృణాల్ ఠాకూర్‌పై నాని అలాంటి ప్రేమనే వ్యక్తపరిచారు. ప్రేమను వ్యక్తపరుస్తూ 'అమ్మాడీ...' అంటూ ఆమెను ఉద్దేశించి పాడారు నాని. 'హాయ్ నాన్న' చిత్రంలోని ఈ పాటను నవంబర్ 4న రిలీజ్ చేయనున్నారు. నాని, మృణాల్ ఠాకూర్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'హాయ్ నాన్న'. నాని కుమార్తెగా బేబీ కియారా ఖన్నా నటించింది. ఈ చిత్రం కోసం హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరపరచిన పాటల్లో తొలి పాట 'సమయమా..', రెండో పాట 'గాజు బొమ్మ..'ను ఇప్పటికే రిలీజ్ చేశారు. 'అమ్మాడీ...' మూడో పాట. నాని, మృణాల్ మధ్య సాగే రొమాంటిక్ సాంగ్ ఇది అని యూనిట్ పేర్కొంది. శౌర్యువ్ దర్శకత్వంలో మోహన్ చెరుకూరి (సీవీఎం), డా. విజయేందర్ రెడ్డి తీగల ఈ చిత్రాన్ని నిర్మించారు. డిసెంబర్ 7న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి కెమెరా: సాను జాన్ వర్గీస్ ఐఈఈ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సతీష్ ఈవీవీ.

కౌంట్ డౌన్ స్టార్ట్



● వెంకటేశ్

వెంకటేశ్ హీరోగా శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'సైంధవ్'. నవాజుద్దీన్ సిద్ధిఖీ, ఆర్య, శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా, బేబీ సారా, జయప్రకాశ్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న 'సైంధవ్' జనవరి 13న సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వస్తోంది. కాగా ఇది వెంకటేశ్ కెరీర్‌లో 75వ చిత్రం కావడం విశేషం. తాజాగా 'సైంధవ్' విడుదలకు కౌంట్ డౌన్ స్టార్ట్ చేస్తూ మేకర్స్ ఓ కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు. ''పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోన్న చిత్రం 'సైంధవ్'. సినిమా విడుదలకు ఇంకా 75 రోజులు ఉంది. సంతోష్ నారాయణన్ ఈ చిత్రం కోసం అద్భుతమైన ఆల్బమ్ సిద్ధం చేశారు. త్వరలో మ్యూజికల్ ప్రమోషన్స్ స్టార్ట్ చేయబోతున్నాం'' అని మేకర్స్ అన్నారు. ఈ చిత్రానికి సహనిర్మాత: కిశోర్ తాళ్లూరు, కెమెరా: యస్. మణికందన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. వెంకటరత్నం (వెంకట్).



ప్రేక్షకులకు పది రెట్ల థ్రిల్ గ్యారంటీ - అనిల్ విశ్వనాథ్

''మా ఊరి పొలిమేర' తొలి భాగం ఓటీటీలో రిలీజ్ కావడంతో ప్రేక్షకుల స్పందన పెద్దగా తెలియలేదు. సినిమా చూసి, చాలామంది బాగుందని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. శుభలేఖ సుధాకర్‌గారు ఫోన్ చేసి, 'దర్శకుడిగా నీకు మంచి భవిష్యత్ ఉంటుంది' అని చెప్పడంతో నాపై నాకు మరింత నమ్మకం పెరిగింది'' అని డైరెక్టర్ డా. అనిల్ విశ్వనాథ్ అన్నారు. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల, బాలాదిత్య, రాకేందు మౌళి ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'మా ఊరి పొలిమేర-2'. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రం నవంబరు 3న రిలీజవుతోంది. ఈ సందర్భంగా అనిల్ విశ్వనాథ్ మాట్లాడుతూ– ''మా ఊరి పొలిమేర' ఎక్కడ ముగిసిందో అక్కడి నుంచే రెండో భాగం మొదలవుతుంది. తొలి భాగం హిట్టవ్వడంతో సీక్వెల్‌పై అంచనాలు పెరిగాయి. అందుకే పార్ట్ 2 స్క్రీన్‌ప్లేను మరింత బలంగా తయారు చేశాను. తొలి భాగంతో పోల్చితే ప్రేక్షకులు దాదాపు పది రెట్ల థ్రిల్ ఫీలవుతారు. వంశీ నందిపాటిగారి సహకారంతో మా చిత్రాన్ని ఘనంగా రిలీజ్ చేస్తున్నాం. 'బన్నీ' వాసుగారికి నచ్చడంతో మా సినిమా పెద్ద రేంజ్‌కు వెళ్లింది. 'మా ఊరి పొలిమేర 3' కూడా ఉంటుంది. అంతకన్నా ముందు వేరే జానర్‌లో ఓ సినిమా చేస్తా'' అన్నారు.

మమ్మల్ని సినిమా కలిపింది - విజయ్ దేవరకొండ



● బ్రహ్మానందం, విజయ్ దేవరకొండ, తరుణ్ భాస్కర్, సాయికృష్ణ

''నేను, దర్శకులు నాగ్ అశ్విన్, తరుణ్ భాస్కర్, సందీప్ రెడ్డి వంగా వేర్వేరు చోట్ల పెరిగాం. మా నేపథ్యాలు వేరు.. మమ్మల్ని సినిమా కలిపింది. 'పెళ్ళి చూపులు'తో నన్ను హీరోగా పరిచయం చేశాడు తరుణ్ భాస్కర్. ఆ తర్వాత 'ఈ నగరానికి ఏమైంది'తో కొందరు కొత్తవాళ్లకు కెరీర్ ఇచ్చాడు. ఇప్పుడు 'కీడా కోలా'లోనూ ప్రతిభ ఉన్న కొత్తవాళ్లు కనిపిస్తున్నారు. తరుణ్‌కి తనపై, తన కథలపై చాలా నమ్మకం. ఈ విషయంలో అతన్ని గౌరవిస్తాను. ఇండస్ట్రీకి దొరికిన అదృష్టం తను'' అని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. తరుణ్ భాస్కర్ దాస్యం దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'కీడా కోలా'. రానా సమర్పణలో కె. వివేక్ సుధాంషు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్, శ్రీపాద్ నిర్మించిన ఈ చిత్రం నవంబర్ 3న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన విజయ్ దేవరకొండ మాట్లాడుతూ–''తరుణ్ భాస్కర్‌పై ఉన్న నమ్మకంతో చెబుతున్నా.. 'కీడా కోలా' మజా ఇస్తుంది. త్వర్లో మా ఇద్దరి కాంబినేషన్‌లో మరో సినిమా వస్తుంది'' అన్నారు. సీనియర్ నటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ–''డైరెక్టర్ జంధ్యాలగారి సినిమాలు చేస్తున్నప్పుడు వినోదం ఎంత హాయిగా పండిందో మళ్లీ 'కీడా కోలా'కి అలాంటి అనుభూతి కలిగింది'' అన్నారు. ''నా 'పెళ్ళి చూపులు, ఈ నగరానికి ఏమైంది' చిత్రాల విడుదలప్పుడు చిన్న భయం ఉండేది. ప్రేక్షకుల స్పందన తెలుసుకునేందుకు థియేటర్ బయటే తిరిగేవాడిని. 'కీడా కోలా' విషయంలో ఆ భయం లేదు'' అన్నారు తరుణ్ భాస్కర్. ''రెండు గంటల పాటు ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారు'' అన్నారు నిర్మాతలు సాయికృష్ణ గద్వాల్, శ్రీపాద్.

ప్రేమకథ షురూ



● నాగచైతన్య, అలేఖ్య హారిక, సంతోష్ శోభన్

సంతోష్ శోభన్, అలేఖ్య హారిక జంటగా కొత్త సినిమా షురూ అయింది. సుమన్ పాతూరి దర్శకత్వంలో అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్‌పై ఎస్‌కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్న ఈ సినిమా సోమవారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి డైరెక్టర్ చందూ మొండేటి కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో నాగచైతన్య క్లాప్ కొట్టగా, డైరెక్టర్ వశిష్ఠ మల్లిడి దర్శకత్వం వహించారు. డైరెక్టర్ హరీష్ శంకర్, నిర్మాత రవిశంకర్ యూనిట్‌కి స్క్రిప్ట్ అందించగా, హీరో సుశాంత్, దర్శకులు హను రాఘవపూడి, రాహుల్ సంకృత్యాన్ యూనిట్‌కి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంతోష్ శోభన్ మాట్లాడుతూ– ''ఈ సినిమాలో మంచి ప్రేమకథ ఉంటుంది'' అన్నారు. ''నా మనసుకు దగ్గరైన కథ ఇది. నేను, ఎస్‌కేఎన్, సందీప్ రాజ్, అలేఖ్య.. మేమంతా ఫ్రెండ్స్. ఈ సినిమా వారితో కలిసి చేస్తుండటంతో మరింత బాధ్యతగా భావిస్తున్నా'' అన్నారు సాయి రాజేశ్. ''ఈ సినిమాకు దర్శకత్వం వహించే చాన్స్ ఇచ్చిన నా ఫ్రెండ్ సాయి రాజేశ్‌కు థ్యాంక్స్'' అన్నారు సుమన్ పాతూరి. ''హీరోయిన్‌గా చేయాలనే నా కల ఈ చిత్రంతో నెరవేరుతోంది'' అన్నారు అలేఖ్య హారిక. ''తెలుగు అమ్మాయిలను ప్రోత్సహించాలనే నా సినిమాల్లో తెలుగు అమ్మాయిలనే హీరోయిన్‌గా తీసుకుంటున్నాను'' అన్నారు ఎస్‌కేఎన్. ఈ చిత్రానికి కెమెరా: అస్కర్, సంగీతం: విజయ్ బుల్గానిన్, సహనిర్మాతలు: ధీరజ్ మొగిలినేని, రమేశ్ పెద్దింటి.



● అచ్యుతరావు, బ్రహ్మానందం, ఉపేంద్ర

ఒకేసారి ఐదు సినిమాలు ఒక సంచలనం - బ్రహ్మానందం

''ఒక సినిమా తీయడానికే ఇబ్బంది పడుతున్న ఈ రోజుల్లో ఒకేసారి ఐదు సినిమాలు తీస్తుండటం ఓ సంచలనం. తన కుమారుడు ఉపేంద్రని హీరోగా పరిచయం చేయడంతో పాటు ఒకేసారి అతనితో ఐదు సినిమాలు తీస్తున్న అచ్యుతరావుకి అభినందనలు. దీనివల్ల పరిశ్రమను నమ్ముకున్నవారికి అవకాశాలు ఇచ్చి, భోజనం పెట్టినట్లవుతుంది. 'ఉపేంద్రగాడి అడ్డా' మంచి హిట్టవ్వాలి'' అని సీనియర్ నటుడు బ్రహ్మానందం అన్నారు. కంచర్ల ఉపేంద్ర, సావిత్రీ కృష్ణ జంటగా ఆర్యన్ సుభాన్ ఎస్‌కే దర్శకత్వం వహించిన చిత్రం 'ఉపేంద్రగాడి అడ్డా'. ఎస్ ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్‌పై కంచర్ల అచ్యుతరావు నిర్మించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకి బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరై, 'ఉపేంద్రగాడి అడ్డా' ట్రైలర్‌ను, '1920 భీమునిపట్నం' పోస్టర్‌ను విడుదల చేశారు. అలాగే ఉపేంద్ర హీరోగా ఇదే బ్యానర్‌లో తీస్తున్న ఐదు సినిమాల టీజర్లను విడుదల చేశారు. కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ– ''మా బ్యానర్‌లో నవంబర్ నుంచి ప్రతీ నెల ఒక సినిమాను విడుదల చేయబోతున్నాం'' అన్నారు. ''నా పుట్టిన రోజుకి ఇది వెలకట్టలేని పెద్ద బహుమతి'' అన్నారు కంచర్ల ఉపేంద్ర. ''సోషల్ మీడియా నేటి సమాజాన్ని ఎంతగా ప్రభావితం చేస్తోందో మా చిత్రం ద్వారా చూపిస్తున్నాం'' అన్నారు ఆర్యన్ సుభాన్ ఎస్‌కే. హీరోయిన్ సావిత్రీ కృష్ణ, సహనిర్మాతలు కంచర్ల సుబ్బలక్ష్మి, కంచర్ల సునీత పాల్గొన్నారు.

కథని నమ్మి చేశాం - శ్రీరామ్



● అవసరాల, ఖుషీ, శ్రీరామ్, సాయికిరణ్, కోన వెంకట్

''పిండం అనేది జననానికి, మరణానికి సంబంధించినది. ఈ 'పిండం' సాయి కిరణ్ లాంటి ప్రతిభగల దర్శకుడి పుట్టుకకు (ఇండస్ట్రీలో) కారణం కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు రచయిత, నిర్మాత కోన వెంకట్. సాయికిరణ్ దైదా దర్శకత్వంలో శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన చిత్రం 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' ఉపశీర్షిక. కళాహి మీడియాపై యశ్వంత్ దగ్గుమాటి నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్నారు కోన వెంకట్. మరో అతిథి బీవీఎస్ రవి (రచయిత, దర్శకుడు) మాట్లాడుతూ– ''ఈ సినిమా టీజర్, నిర్మాణ విలువలు బాగున్నాయి. తప్పకుండా విజయం సాధిస్తుంది'' అన్నారు. శ్రీరామ్ మాట్లాడుతూ– ''కథని నమ్ముకొని చేసిన చిత్రం 'పిండం'. ఈ సినిమాలో భాగం కావడం సంతోషంగా ఉంది. ఈ చిత్రంలో నటించిన ఇద్దరు పిల్లల నటన చూసి నేనే ఆశ్చర్యపోయాను. ఇలాంటి మంచి సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు. ''కళాహి మీడియా బ్యానర్‌పై 'పిండం'లాంటి మంచి సినిమాలు మరిన్ని చేస్తాం'' అన్నారు యశ్వంత్ దగ్గుమాటి. ''ఇదొక ఇంటెన్స్ హారర్ ఫిల్మ్'' అన్నారు సాయి కిరణ్ దైదా. సంగీత దర్శకుడు కృష్ణ సౌరభ్ సూరంపల్లి, కెమెరామేన్ సతీష్ మనోహర్ తదితరులు మాట్లాడారు.

అంబాజీపేట సంతృప్తి ఇచ్చింది - సుహాస్



● సుహాస్, శివానీ నాగరం

''అంబాజీపేట మ్యారేజి బ్యాండు' ఫ్రెష్ సబ్జెక్ట్. సినిమా కొత్తగా ఉంటుంది. నటుడిగా నాకు సంతృప్తినిచ్చింది. ఒక మంచి సినిమా చూశామనే అనుభూతితో ప్రేక్షకులు థియేటర్స్ నుంచి బయటకు వస్తారు'' అని సుహాస్ అన్నారు. దుశ్యంత్ కటికినేని దర్శకత్వంలో సుహాస్, శివానీ నాగరం జంటగా నటించిన చిత్రం 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. జీఏ2 పిక్చర్స్, మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్ నిర్మించాయి. ఈ చిత్ర సంగీతదర్శకుడు శేఖర్ చంద్ర స్వరపరచిన 'గుమ్మా....' అంటూ సాగే తొలి పాటను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా దుశ్యంత్ కటికినేని మాట్లాడుతూ– ''ఈ పాటకి రెహ్మాన్ మంచి లిరిక్స్ ఇచ్చారు. ఈ సినిమాలోని పాటలన్నీ బాగుంటాయి'' అన్నారు. ''జనవరి నెలాఖరులో సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు ధీరజ్ మొగిలినేని. ''మంచి సినిమాలు ఎప్పుడొచ్చినా ప్రేక్షకులు ఆదరిస్తారు. 'అంబాజీపేట..' హిట్ కావాలి'' అన్నారు నిర్మాత ఎస్‌కేఎన్. నటులు జగదీశ్, నితిన్, డ్యాన్స్ మాస్టర్ మోయిన్ తదితరులు మాట్లాడారు.